# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :27 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 25-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఉగ్రవాదులు సముద్రం ద్వారా చొరబడతారు..

సముద్రతీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపర్ స్టార్ రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా దేశంలోకి చొరబడే అవకాశం ఉందని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు.మన దేశ కీర్తిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా చొరబడి విధ్వంసం సృష్టిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 26/11 ముంబై ఉగ్రదాడి ఘటనను రజనీకాంత్ ఉదహరించారు. ఈ దాడి ఘటనలో సుమారు 175 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అందువల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 7 వేల కిలోమీటర్ల సైకిల్ ప్రచార యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. వారు మీ ప్రాంతాలకు వచ్చేటప్పుడు స్వాగతించాలని సూచించారు. కుదిరితే వారితో కొంచెం దూరం వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

## హైడ్రాపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపణలు.. రంగనాథ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రాకు ఎవరు ఫిర్యాదు చేసినా అకనాల్జ్‌మెంట్ ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో వంశీరాం బిల్డర్‌కు చెందిన ప్రపార్టీ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.అసెంబ్లీ లాబీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. హైడ్రాకు ఎవరు ఫిర్యాదు చేసినా అకనాల్జ్‌మెంట్ ఇస్తున్నాం. జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కూడా క్లారిటీ ఇచ్చాం. మ్యాన్ హట్టన్ ప్రాజెక్టుపై ఫోకస్ పెట్టాం. దీనిపై ఫిర్యాదు ఇస్తే.. తప్పకుండా యాక్షన్ తీసుకుంటాం. వంశీరాం బిల్డర్‌కు చెందిన ప్రపార్టీ విషయం మా దృష్టికి తెచ్చారు. మేము దాన్ని గూగుల్ మ్యాప్ ద్వారా చూస్తే.. అంత క్లారిటీ రావడం లేదు. సర్వే చేసి.. తేడా ఉంటే యాక్షన్ తీసుకుంటాం. ప్రస్తుతం అక్కడ మట్టిని డంప్ చేసినట్లు మా దృష్టికి వచ్చింది.. తీసేయాలని ఆదేశాలు ఇచ్చాం అంటూ కామెంట్స్ చేశారు.ఇదిలా ఉండగా.. అంతకుముందు.. హైడ్రాపై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల హైడ్రా అక్రమాలను ఏకంగా అసెంబ్లీలోనే ప్రస్తావించారు. కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. హైడ్రా నోటీసులు ఇచ్చి లావాదేవీలు నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫోన్ లిఫ్ట్ చేయడు.. ఆయన దగ్గర నుండి ఎలాంటి రెస్పాన్స్ ఉండదని తెలిపారు. ఎమ్మెల్యేకే స్పందించకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. మ్యాన్ హట్టన్ ప్రాజెక్టుపై మరోసారి సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తా అని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. ఖాజాగూడలోని కొత్తకుంటలో వంశీరాం బిల్డర్లు నిర్మాణాల విషయంలో ఇటీవల హైడ్రా తీరుపై ఎమ్మెల్యే అనిరుధ్ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

## సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందే బీఆర్ఎస్..

నల్లగొండ: నల్లగొండ జిల్లాలో పర్యటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్టీవీతో మాట్లాడుతూ.. కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు..పార్లమెంట్ స్థానాల్లో డిపాజిట్ లు కోల్పోయారు అని మండిపడ్డారు. కేటీఆర్ కు SLBC ఎక్కడుందో కూడా తెలియదు అన్నారు. ప్రభాకర్ రావును విదేశాల్లో దాచిపెట్టింది బీఆర్ఎస్ అని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ చేయరు.. అమెరికాకు పారిపోవాల్సిన అవసరం కాంగ్రెస్ నేతలకు రాదని చెప్పుకొచ్చారు. ఇక, బీఆర్ఎస్ నేతలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందే బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు ఎస్ఎల్బీసీ లో ప్రమాదం బాధాకరం..10 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ తమ ఉనికి కోల్పోతుందని తెలిపారు. ధాన్యం కొనుగోళు పూర్తైన రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయి.. రైతులను



ఇబ్బంది పెట్టే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.. బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే సాగునీటి కష్టాలు తప్పేవి అని మంత్రి వెంకట్ రెడ్డి అన్నారు.

## అమరావతి 2.0.. 250 ఎకరాల్లో ప్రధాని సభ

అమరావతి,రాజధాని అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ.. మరోసారి రాజధానిలో పర్యటించనున్నారు. అమరావతి పునఃనిర్మాణ పనుల ప్రారంభానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీని ప్రభుత్వం ఆహ్వానించింది. గత వారం ఢిల్లీలో పర్యటించిన సీఎం చంద్రబాబు అమరావతి పనుల ప్రారంభానికి రావాల్సిందిగా పీఎం మోదీని ఆహ్వానించారు. ప్రధాని ఏ తేదీన వచ్చేది ఇంకా ఖరారు కాకపోయినా, 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వెలగపూడిలోని సచివాలయానికి సమీపంలో భూమిని ఎంపిక చేశారు. ఆదివారం నుంచి భూమి చదును పనులు కూడా మొదలయ్యాయి.సీఎం చంద్రబాబు ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ అమరావతి పర్యటనకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీ మధ్య ప్రధాని పర్యటన ఉండే అవకాశం ఉంది. సుమారు రూ.42 వేల కోట్లతో రాజధాని అమరావతి పనులకు ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. 2015లో తొలిసారిగా రాజధానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పలు పనులు జరిగాయి. ప్రస్తుతం ఉన్న సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు అన్నీ నిర్మాణమయ్యాయి. ఇక 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అమరావతి పనులు నిలిచిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు తిరిగి మొదలయ్యాయి. రూ.42 వేల కోట్లతో పనులు ప్రారంభానికి ప్రధాని మోదీని సీఎం ఆహ్వానించారు. అయితే ప్రధాని ఏ తేదీన పర్యటించేది నిర్దిష్టంగా ప్రకటించకపోయినప్పటికీ వెలగపూడి సచివాలయం పక్కన ఎస్-9



రోడ్డుకు పశ్చిమంగా 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహణకు స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సదరు ప్రాంగణాన్ని ఆదివారం నుంచి చదును పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 16 పొక్లయిన్లు, 4 భారీ క్రేన్లు, 6 ట్రక్కులతో పనులు పెద్ద ఎత్తున మొదలుపెట్టారు. ఈ నెల 30న ఈ ప్రాంతంలోనే 30-40 ఎకరాల్లో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాని సభను కూడా ఇక్కడే ఏర్పాటు చేసే ఉద్దేశంతో విస్తీర్ణాన్ని 250 ఎకరాలకు పెంచారు. కాగా, ప్రధాని మోదీ పర్యటించనుండటంతో రాజధానికి మరిన్ని నిధులు, మరింత సహకారంపై ప్రకటన విడుదల కావొచ్చని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## కునాల్ కమ్రా వ్యాఖ్యలపై స్పందించిన అజిత్ పవార్



ముంబై:మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. షిండేను ఉద్దేశించి దేశద్రోహి అంటూ చేసిన వ్యాఖ్యలు రచ్చరచ్చ చేస్తున్నాయి.ఇప్పటికే శివసేన కార్యకర్తలు విధ్వంసానికి దిగారు. ఇక శివసేన కార్యకర్తలు.. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు.ఇక ఈ అంశంపై ప్రభుత్వం నుంచి డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. ఎవరూ కూడా చట్టం పరిధి దాటి వ్యవహరించకూడదని సూచించారు. రాజ్యాంగ నియమాలకు వ్యతిరేకంగా ఎవరూ ప్రవర్తించకూడదని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు కట్టుబడి మాట్లాడాలని హితవు పలికారు. అభిప్రాయ భేదాలు ఉండొచ్చు. అంతమాత్రాన హద్దులు దాటి మాట్లాడడం భావ్యం కాదన్నారు. ఎవరైనా పరిమితుల్లోనే మాట్లాడాలన్నారు. అనుచిత వ్యాఖ్యలు కారణంగా పోలీస్ శాఖ జోక్యం చేసుకోవల్సి వచ్చిందన్నారు. ఇక ఈ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ గానీ.. డిప్యూటీ సీఎం షిండేగానీ స్పందించలేదు.నెల రోజుల క్రితం ఒక షోలో కమెడియన్ కునాల్ కమ్రా.. షిండేను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. 1997 బ్లాక్‌బస్టర్ దిల్ తో పాగల్ హై చిత్రంలోని 'భోలి సి సూరత్' పాటను పేరడీ చేసి కునాల్ కమ్రా పాడారు. ఏక్‌నాథ్ షిండేను లక్ష్యంగా చేసుకుని పేరడీ చేశారు. 2022లో ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటుకు నాయకత్వం వహించి, ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేసి, పార్టీని విభజించిన శివసేన నాయకుడు దేశద్రోహి అంటూ కునాల్ వ్యాఖ్యానించాడు.తాజాగా ఆ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో శివసేన కార్యకర్తలు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. దీంతో ఆదివారం ముంబైలోని హాబిటాట్ స్టూడియోపై శివసేన కార్యకర్తలు దాడి చేశారు. అంతేకాకుండా ఒక క్లాబ్‌పై కూడా దాడి చేశారు. కుర్చీలు, కెమెరాలు, లైట్లు, స్పీకర్లను ధ్వంసం చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.తాజా పరిణామాల నేపథ్యంలో ది హాబిటాట్ స్టూడియోను మూసివేయాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. స్టాండ్-అప్ కామెడీ షోలకు ఈ స్టూడియో పేరు సంపాదించింది. ప్రస్తుతానికి మూసివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ది హాబిటాట్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసింది.

## కమెడియన్ వ్యాఖ్యల ఎఫెక్ట్.. రాహుల్‌గాంధీ, ఆదిత్య ఠాక్రేపై ఎఫ్ఐఆర్



ముంబై:మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. థానే నుంచి వచ్చిన ఓ నాయకుడు.. బీజేపీతో చేతులు కలిపి శివసేనను చీల్చేశాడంటూ..అతడు దేశద్రోహి అంటూ షిండేను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముంబైలోని ఖార్ ప్రాంతంలోని 'ది హాబిటాట్ కామెడీ' క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కునాల్ కమ్రా 'దిల్ తో పాగల్ హై' పాటను రాజకీయ పేరడీ చేసి పాడారు. ఇందులో షిండేను ఉద్దేశించి ద్వంద్వ అర్థం వచ్చేలా పాడారు. ఈ సందర్భంగా షిండేను ఉద్దేశించి దేశద్రోహి అంటూ అభివర్ణించాడు. ఇదే షిండే అభిమానులకు కోపం తెప్పించింది. కునాల్‌కు వ్యతిరేకంగా క్లబ్‌పై శివసేన కార్యకర్తలు దాడి చేశారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఇక కునాల్ కమ్రా వ్యాఖ్యలు దుమారం చెలరేగడంతో శివసేన యువసేన ప్రధాన కార్యదర్శి రాహుల్ కనాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కునాల్ కమ్రా సహా రాహుల్‌గాంధీ, ఆదిత్య ఠాక్రేపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ముగ్గురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కునాల్.. పేమెంట్ కమెడియన్‌గా పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతోనే షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందంటూ శివసేన నేత ఆరోపించారు.కునాల్ ప్రజల మనోభావాలు దెబ్బ తీసే విధంగా వ్యాఖ్యానించాడని.. ఉద్దేశ పూర్వకంగానే షిండేను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కామ్రా వ్యాఖ్యలు భారతీయ న్యాయ సంహిత 2023 నిబంధనల ప్రకారం అభ్యంతరకరమైనవి, చట్టవిరుద్ధమైనవని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా షిండే పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు అని ఫిర్యాదులో తెలిపాడు. ప్రజాప్రతినిధులపై నిర్మాణాత్మక విమర్శలు ఎప్పుడు స్వాగతిస్తామని.. అంతేకాని కించపరిచే, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తే సహించమన్నారు. క్రిమినల్ నేరాలుగా పరిగణించాలని కోరారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనల్ డిమాండ్ చేశారు.ఇదిలా ఉంటే క్లబ్‌పై దాడి చేసిన శివసేన కార్యకర్తలపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. క్లబ్ లోపల కుర్చీలు విసిరి, వస్తువులు పగలగట్టారు. అంతేకాకుండా కమెడియన్‌ను ఒక ఎంపీ బెదిరింపులకు పాల్పడ్డారు. దేశంలో ఎక్కడా తిరగనివ్వమన్నారు.ఇక శివసేన కార్యకర్తల దౌర్జన్యంపై శివసేన(యూ బీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే ఖండించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయ ంటూ ధ్వజమెత్తారు. ఇక శివసేన కార్యకర్తలు చేసిన విధ్వంసానికి సంబంధించిన దృశ్యాలను శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో ఒక బలహీనమైన హోం మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఉన్నారని ఆరోపించారు. మహారాష్ట్ర రాజకీయాలపై కునాల్ వ్యంగ్య పాట రాశారని..దానికి షిండే అభిమానులు క్లబ్‌ను ధ్వంసం చేయడం దారుణం అన్నారు.

## శ్రీశైలానికి పోటెత్తిన కన్నడ భక్తులు..

శ్రీశైలం: శ్రీశైలం మల్లన్న ఆలయానికి కన్నడ భక్తులు పోటెత్తారు భక్తుల రద్దీతో ఇప్పటికే ఉగాది ఉత్సవాలకు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు విస్తృత ఏర్పాట్లు చేశారు..ఈనెల 27 నుండి 31వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉగాది మహోత్సవాలు సమీపిస్తుండడంతో మల్లన్న ఆలయానికి కన్నడ భక్తజనం బారులు తీరారు. అయితే, ఉగాది మహోత్సవాలకు వారం ముందు నుంచే కన్నడ భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. దానికి తోడు ఈనెల 26 వరకు మాత్రమే కన్నడ భక్తుల సౌకర్యార్థం దేవస్థానం మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనానికి అనుమతించారు. 27 నుండి ఉగాది మహోత్సవాల సందర్భంగా 31వ తేదీ వరకు భక్తులందరికీ శ్రీమల్లికార్జునస్వామి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతించడంతో ఈనెల 26 లోపే శ్రీమల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం చేసుకునే భాగ్యం కలుగుతుందని కన్నడ భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. దానికి తోడు ప్రత్యేక కావడిలో తమ ఇంటి ఆడపడుచుగా భావించే భ్రమరాంబా దేవి అమ్మవారికి పసుపు, కుంకుమతో పాటు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తుల రద్దీతో తలపోటు వచ్చిందేమోనని మిరియాల చూర్ణాన్ని సాంప్రదాయంగా కావడిలో తీసుకొని లక్షలాదిగా తరలివ స్తున్నారు. తెల్లవారుజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యాస్నానాలు ఆచరించి శ్రీమల్లికార్జునస్వామి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



క్యూలైన్స్ లో మంచినీరు, పాలు, బిస్కెట్లు, అల్పాహారం అందిస్తూ భక్తులకు సేవలందిస్తున్నారు. దీనితో శ్రీస్వామివారి స్పర్శ దర్శనానికి 3 గంటల సమయం అలానే శ్రీస్వామి అలంకార దర్శనానికి 5 గంటల సమయం పడుతుంది. అయితే ఈనెల 27 నుండి 31 వరకు ఉగాది ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి శ్రీస్వామివారి అలంకార దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు లక్షలలో పెరగడంతో శ్రీశైలంలో కన్నడ భక్తుల రద్దీతో సెల్ ఫోన్ సిగ్నల్స్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సెల్ ఫోన్స్ సిగ్నల్స్ లేకపోవడంతో భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఇబ్బందిపై సంబంధిత అధికారులు స్పందించి సిగ్నల్స్ వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని పలువురు కన్నడ భక్తులు కోరుతున్నారు.

## హైదరాబాద్ లో భారీ వర్షం.. ట్రాఫిక్ జామ్!

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో పలు చోట్ల వర్షం పడుతుంది. వాతావరణంలో మార్పుల వల్ల నగరంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వాన కురుస్తోంది.కాగా, హైదరాబాద్ పరిధిలో బోరబండా, మాదాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్, జూబ్లిహిల్స్, సుల్తాన్ పూర్, మల్లంపేట్, గండి మైసమ్మ పరిసర ప్రాంతాలలో కురుస్తుంది వర్షం. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో ఎండలు తీవ్రరూపం దాల్చాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నారు. దీంతో పట్నం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఉక్కపోత.. మరోవైపు చెమటతో తీవ్ర అవస్థలు పడుతున్న సమయంలో హైదరాబాద్‌లో వర్షం కురవడం కాస్త ఉపశమం పొందుతున్నారు. అయితే, మరోవైపు రోడ్లపై వర్షం నీటితో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. నెమ్మదిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి.కాగా, ఎండలతో



మండిపోతున్న వేళ తెలంగాణలోని ఆసిఫాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలో వర్షం కురుస్తుంది.

## ఇష్టారీతిన శాసనసభ సమావేశాలు.. ఓ పద్ధతి లేదు : జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్ : శాసనసభ సమావేశాలను ఇష్టారీతిన నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 27 వరకు బడ్జెట్ సమావేశాలకు హాజరుకాకుండా స్పీకర్ ఆయనపై వేటు పడిన సంగతి తెలిసిందే. అయినా సోమవారం జగదీశ్ రెడ్డి అసెంబ్లీకి వచ్చారు. అయితే సభ లోపలికి వెళ్లకుండా చీఫ్ మార్షల్ అడ్డుకున్నారు. తన సస్పెన్షన్‌పై ఇంతవరకు ఎలాంటి బులెటిన్ ఇవ్వలేదని, అలాంటప్పుడు సస్పెండ్ చేశారనడానికి ఆధారాలు ఏమున్నాయని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నన్ను ఏ కారణంతో సస్పెండ్ చేశారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి బులెటిన్ విడుదల చేయలేదు. సస్పెండ్ చేశారో లేదో కనీసం ఆధారాలు లేవు. బులెటిన్ ఇస్తే నేను రాను. లేదంటే సభాపతిని కలుస్తా. నేను కోర్టుకు వెళ్తానన్న భయంతో బులెటిన్ ఇవ్వట్లేదు. ఎలాంటి రాజ్యాంగ విలువలు, నిబంధనలు పాటించకుండా సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అరాచకత్వానికి ఇది పరాకాష్ట. మంత్రులు జవాబివ్వలేక ప్రశ్నోత్తరాలు రద్దు చేస్తున్నారు.' అని జగదీశ్ రెడ్డి దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా మంత్రులు దావత్‌లకు కూడా ప్రభుత్వ హెలికాప్టర్లలో వెళున్నారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఒక గంట ప్రయాణానికి కూడా హెలికాప్టర్‌లో వెళ్తున్నారని అన్నారు. నిన్న జాన్‌పాడ్‌లో దావత్‌కు కూడా జానారెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నలకు సమాధానం చెప్పలేక క్వశ్చన్ అవర్ రద్దు చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలపై శాసనసభలో లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు లేదని ఆరోపించారు.పవర్ ప్లాంట్‌లో రాత్రి 10.15 గంటలకు ప్రమాదం జరిగితే.. తానే ముందు చేరుకున్నానని చెప్పారు.

## సంపాదకీయం

మంగళవారం 25-03-2025

# మానవాళి భవితకు జల భద్రత

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. జల భద్రతతోనే భవిత సురక్షితం. ఏటా మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. నీటి ప్రాముఖ్యత, సరఫరా, పరిరక్షణ అవసరాన్ని గుర్తుచేసుకోవడం దీని ముఖ్య ఉద్దేశం. భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలనేది లక్ష్యం. 2025 ప్రపంచ జల దినోత్సవాన్ని హిమానీనదాల సంరక్షణ, మంచినీటి వనరుల రక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అరికట్టే చర్యలపై చర్చించేందుకు ఉద్దేశించారు.ప్రపంచంలో లభ్యమయ్యే మంచినీటిలో దాదాపు 68.7శాతం హిమానీనదాలు, మంచు పొరల్లోనే ఉంది. నీటి వనరుల లభ్యత సుస్థిరంగా సాగేలా చేయడంలో హిమానీనదాలదే కీలక పాత్ర. అయితే, భూతాపం హిమానీనదాల కరుగుదలను వేగవంతం చేస్తోంది. నీటి సరఫరాను క్షీణింపజేస్తోంది. జల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తోంది. హిమానీనదాల సంరక్షణ అనేది కేవలం భౌగోళిక అంశమే కాదు. ఇది ప్రజలందరి ప్రగతికి, జీవన విధానానికి కీలకం.

వేగంగా ఎందుకు కరుగుతున్నాయి?

హిమానీనదాల ఉపరితలం తెల్లగా ఉంటుంది. ఫలితంగా సూర్యకాంతిని తిరిగి పరావర్తనం చెందిస్తుంది. హిమానీనదాల కరుగుదలతో వాటి స్థానంలో నీరు లేదా కాలుష్యంతో నిండిన మంచు ఏర్పడుతుంది. ఇవి సహజంగా తక్కువ పరావర్తనాన్ని కలిగి ఉండటంతో అధికంగా ఉష్ణాన్ని గ్రహిస్తాయి. కరుగుదల మరింత వేగవంతమవుతుంది. ఈ ప్రక్రియను 'అల్బెడో ఎఫెక్ట్'గా వ్యవహరిస్తారు.

ప్రధాన ప్రభావిత ప్రాంతాలేవీ?

పరిశ్రమల కర్బన ఉద్గారాలు, వృక్షసంపద నష్టం, సహజ వనరుల అధిక వినియోగం వంటి మానవ కార్యకలాపాల పెరుగుదలతో హిమాలయ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సగటు ఉపరితల ఉష్ణోగ్రతల పెరుగుదల 1.6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిపోయింది. దీనివల్ల హిమానీనదాల కరుగుదల వేగవంతమై సరస్సుల విస్ఫోటనం సంభవించి వరదలు రావడం, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులకు దారితీస్తోంది. హిందూకుష్ పర్వతశ్రేణిలో హిమానీనదాలు ఇప్పటికే 65శాతం మేర నష్టపోయాయి. హిమాలయాల మొత్తం మంచు కప్పు 40శాతం తగ్గింది. ఉష్ణోగ్రత ఇలాగే పెరిగితే, ఈ శతాబ్దం చివరి నాటికి హిమానీనదాలు 75శాతం వరకు నష్టపోవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గంగా వంటి నదులు వర్షాకాలంలో వరదలతో, వేసవిలో నీటి కొరతతో సతమతమవుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో 90శాతం హిమాలయ వ్యవసాయం వర్షాధారానికి పరిమితవుతోంది. ఇది స్థానికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దానివల్ల దిగువ ప్రాంతాల్లో నివసించే కోట్లమంది దీర్ఘకాలిక సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది.

ఎంత నష్టం?

ప్రపంచంలో సుమారు 1.98 లక్షల నుంచి రెండు లక్షలదాకా హిమానీనదాలు ఉన్నాయి. వీటి మొత్తం వైశాల్యం సుమారు ఏడు లక్షల చ.కి.మీ.లు. అంతర్జాతీయ పరిశోధన ప్రకారం 2000–2011మధ్య హిమానీనదాలు సంవత్సరానికి సగటున సుమారు 23 వేలకోట్ల టన్నుల చొప్పున కరిగాయి. ఇది 2012–2023 మధ్య కాలంలో సుమారు 31 వేలకోట్ల టన్నులకు పెరిగింది. ఈ శతాబ్దం ప్రారంభం నుంచి హిమానీనదాలు వాటి పరిమాణంలో అయిదు శాతం కోల్పోయాయి. ఇది ప్రాంతాలవారీగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి సగటున సుమారు 27 వేలకోట్ల టన్నులకుపైగా మంచు కరుగుతోంది. ఇది ప్రపంచ జనాభా 30 ఏళ్లపాటు వినియోగించగల నీటి మొత్తానికి సమానం. హిమానీనదాల కరుగుదల కారణంగా సముద్రమట్టం ఏటా రెండు సెం.మీ. పెరుగుతోంది. దీనిప్రభావం ఏటా 20 లక్షల మందిపై పడుతోంది. తీర ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతూ, నీటి లభ్యత సంక్లిష్టమవుతోంది. ఆసియా, ఐరోపా, దక్షిణ అమెరికాల్లో చాలామంది తాగునీరు, వ్యవసాయం, జల విద్యుత్‌కోసం వీటిపైనే ఆధారపడుతున్నారు. దాంతో ఆహార, తాగునీటి భద్రతలకు సమస్య తలెత్తుతోంది. విద్యుత్ ఉత్పత్తి సమస్యలూ జటిలమవుతున్నాయి.

భారత్ పరిస్థితి ఏంటి?

దేశంలోని హిమాలయ పర్వత ప్రాంతం ప్రపంచ ప్రఖ్యాత హిమానీనదాలకు నిలయం. దేశంలో సుమారు 16,627 వరకు హిమానీనదాలు ఉన్నాయి. వీటి విస్తీర్ణం దాదాపు 60వేల చ.కి.మీ.లు. లద్దాఖ్‌లోని సియాచిన్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద హిమానీనదంగా పేరొందింది. గంగా, యమునా, సింధు వంటి ప్రధాన నదులు హిమానీనదాల నుంచి ఉద్భవించాయి. దాదాపు 1.9 బిలియన్లకు పైగా ప్రజలు వీటిపై ఆధారపడుతున్నారు. ఇందులో ఇండియా, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, నేపాల్, చైనా, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాలవారు ఉన్నారు.

ఎలా సంరక్షించుకోవాలి?

హిమానీనదాలను సంరక్షించాలంటే ముందు భూతాపాన్ని నియంత్రించాలి. మంచినీటి వనరులను కాపాడాలి. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, ఉత్పత్తి విధానాల్లో గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించడం ముఖ్యం. పర్యావరణ అనుకూల పట్టణ ప్రణాళికలు అవసరం. ప్రజల్లో నీటి పొదుపు, పునర్వినియోగాన్ని ప్రోత్సహించాలి. మరోవైపు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో బలమైన చట్టాలతో నిబంధనలను కఠినతరం చేయాలి. ప్రభుత్వాలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి పనిచేయాలి. హిమానీనదాల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసమే కాదు– అది మానవాళి భవితను కాపాడే మార్గం!

# ఇంధన విధానంపై సమీక్షించాలి !

న్యూఢిల్లీ,కరోనా తరవాత సొంత వాహనాల వాడుకం పెరిగింది. బ్యాంకులు సులువుగా రుణాలు ఇవ్వడంతో పాటు, వాహనం అన్నది వ్యక్తిగత అవసరంగా మారడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ టూవీలర్, ఫోర్ వీలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఉన్నంతలో తమ ఖర్చులను తగ్గించి ఇందుకు సాహిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యతరగతి వారిపై వాహన, పెట్రో,డీజిల్ ఖర్చులు అదనం అవుతున్నాయి. అదే క్రమంలో రిజిస్ట్రేషన్ ధరలు ఇతరత్రా ఖర్చులు పెరుగుతున్నాయి. నిజానికి ప్రభుత్వం సొంతంగా ఇళ్లు కొనుక్కోవాలనుకునే వారికి, కట్టుకునే వారికి అనుగుణంగా రుణాలు ఇచ్చేలా నిబంధనలు సడలించాలి. వాహనాలు, ఇంటి రుణాలపై వడ్డీలు, రిజిస్ట్రేషన్లు తగ్గించాలి. ఇది ఓరకంగా ప్రోత్సాహకరంగానూ ఉంటుంది. వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. అలాగే పెట్రో,డీజిల్ ధరలు కూఆ అందుబాటులోకి రావాలి. పెట్రో ధరలకే ఇవి వాహనాలు అందుబాటులోకి వస్ఆయిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు కొంత ఉత్సాహాన్ని ఇచ్చేదే. అయితే దేశీయంగా ఇందన రంగాన్ని ప్రోత్సహించాల్సి ఉంది. సోలార్ పవర్ పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. దీంతో విద్యుత్ ఖర్చులు, ఇంధన ఖర్చులు తగ్గుతాయి. బయోడీజిల్ ఉత్పత్తికి అవసరమైన కానుగ చెట్ల పెంపకం అంటూ దివంతగ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా ఉన్న సమయంలో హడావిడి జరిగింది. కానుగ చెట్ల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇచ్చారు. అయితే ఆ తరవాత ఏమయ్యిందో ఏమో గానీ దీని ఊసేలేకుండా పోయింది. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల గురించి పరిశోధనలు ఏ మేరకు జరుగుతున్నాయో కానీ.. ఇంధన వనరుల కోసం మనం విదేశాలపై ఆధారపడుతున్నాం. లాటిన్ అమెరికా దేశం భారీ పరిమాణంలో చెరకు దిగుబడులను సాధిస్తోంది. ఆ చెరకు నుంచి నేరుగా బయోడీజిల్‌ను ఉత్పత్తి చేస్తోంది. నేల, నీరు అపారంగా ఉన్న కారణంగా, ఆహార భద్రతపై ఎటువంటి ప్రభావం లేకుండా ఆ సహజ వనరులలో గణనీయమైన భాగాన్ని బయోడీజిల్ ఉత్పత్తికి వినియోగించుకునే వెసులుబాటును పరిశీలించాలి. ఆహారోత్పత్తికి భంగం వాటిల్ల కుండా.. బయోడీజిల్ ఉత్పత్తికి నిరుపయెగంగా ఉన్న భూముల ను వినియోగిస్తే ఫలితం ఉంటంది. బయోడీజిల్ ఉత్పత్తికి చెరకును మరింతగా ఉత్పత్తి చేయడం వల్ల అధికాదాయం లభిస్తుంది.ఇకపోతే చక్కెర ఉత్పత్తికి వినియోగించుకున్న అనంతరం మిగిలే చెరుకు పిప్పిని విద్యుదుత్పత్తికి వినియోగించు కోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వరి, గోధుమ పంటల సాగుతో కూడా మనకు ఎండుగడ్డి అపారంగా సమకూరుతుంది. దానిని పశు గ్రాసంగా మాత్రమే కాకుండా విద్యుదుత్పత్తికి కూడా బాగా వినియోగించు కోవచ్చు. అలాగే కాగితాల తయారీ మొదలైన ఇతర ప్రయోజ నాలు కూడా ఎండుగడ్డితో సమకూరుతాయి. కనుక వివిధ ఉపయోగాలు ఉన్న కారణంగా ఎండుగడ్డిని ఉత్పత్తి చేసుకోవడమే మనకు అనేక విధాలుగా లాభకరమైన వ్యవహారం. ప్రస్తుత ఇంధన సంక్షోభ సమయంలో మనం పలురకాల ప్రత్యామ్నాయాలను ఆలోచనచేయాలి. సమస్యను అధిగమించేందుకు ఇంధన వినియోగాన్ని మరింతగా తగ్గించే విషయమై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సంపన్నులు, సామాన్యులను అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలి. దీంతో పర్యావరణం




కూడా పరిరక్షించుకోగలం. మన అవసరాల మేరకు...మనకున్న భూమిని,నీటిని ఉపయోగించు కుని ఉత్పత్తులు పెంచుకోకుంటే భవిష్యత్‌లో ఇంతకన్నా దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చు. బయోడీజిల్ ఉత్పత్తికి భారీ పరిమాణంలో నీరు అవసర మవుతుందన్న వాదనా ఉంది. ఒక హెక్టారు భూమిలో చెరకుసాగుకు, గోధుమసాగు కంటే 20రెట్లు అధికంగా నీరు అవసరమవుతుంది. మరి మన జలవనరులు ఇప్పటికే బాగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా భూగర్భ జలాలు ఏయేటి కాయేడు తగ్గిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చెరుకు సాగుకు మరింతగా భూగర్భ జలాలలను వాడు కుంటే భూగర్భ జలమట్టం మరింతగా పడిపోతుందన్న వాదనా ఉంది. ఈ పరిస్థితి తప్పకుండా మన ఆహార భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని కొందరు హెచ్చరిస్తున్నారు. జీవ ఇంధనాలను ప్రోత్సహించడం అవసరమన్న ఆలోచనచేయడం లేదు. ఇక తాజా పరిస్థితులను పరిశీలిస్తే ఉక్రెయిన్‌లో యుద్ధం ఇంధన చమురు ధర పెరుగుదలకు దారితీసింది. యుద్ధం కొనసాగిన పక్షంలో చమురు ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఎంతైనా ఉంది. తాజాగా పెరిగిన ధరల తీరు చూస్తుంటే ఈ ధరల మోత ఇక ముందు కూడా ఆగదని స్పష్టం అవుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలలో ఇంధన భద్రతను సమకూర్చుకోవల్సిన అగత్యాన్ని హెచ్చరిస్తోంది. ఈ పరిణామాల క్రమంలో దేశంలోని పాలకులు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలి. మూడు ప్రధాన ఇంధన వనరులు చమురు, బొగ్గు, యురేనియం దిగుమతులపై మన ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. జీవ ఇంధనాలను ప్రోత్సహించడం ఒక ప్రత్యామ్నాయ మార్గమని పలువురు సూచిస్తున్నారు. చెరుకు నుంచి, సారహీన నేలల్లో పెరిగే జట్రోఫా మొక్కల విత్తనాల నుంచి జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసుకోవచ్చని కూడా అంటున్నారు. సారహీన అంటే చౌడు నేలలను ఉపయోగించు కోవడం ద్వారా జీవ ఇంధనాల ఉత్పత్తిని ఇతోధికంగా పెంచుకోవడం సాధ్యమవుతుంది. అలాగే సోలార్ పవర్‌పై మరింత విస్తృతంగా పరిశోధనలు జరగగాలి. విద్యుత్ ఉత్పత్తిని పెంచుకుని, వాహనాలకు విద్యుత్ వాడకాన్ని ఉపయోగించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. దేశ శ్రేయస్సు దృష్ట్యా మాత్రమే బయోడీజిల్ మొదలైన జీవ ఇంధనాలను ప్రోత్సహించాలి. అందుకు అవసరమైన పరిశోధనలు జరగాలి. దీని ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి.

# అమిత్ షా భాషా రాజకీయ డ్రామా



న్యూఢిల్లీ,జాతీయ విద్యావిధానం, త్రిభాషా సూత్రంపై తమిళనాడుకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వివాదం సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం (21.3.2025) నాడు రాజ్యసభలో హిందీని సమర్థిస్తూ తమిళనాడుపై పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. హిందీ ఏ భాషకూ పోటీకాదని, అన్ని భాషలకూ సోదరభాష అని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, పంజాబీ, అస్సామీ ఈ విధంగా అన్ని భాషలకూ ప్రాచుర్యం కల్పించడానికి మోడీ ప్రభుత్వం రాజ్యభాషా విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి గత రెండేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని, మేం అధికారంలోకి వస్తే మెడికల్, ఇంజినీరింగ్ విద్యను తమిళభాషలోనే అందిస్తామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమిళనాడు ఓట్ల వేట కోసం ఇదో పాచిక తప్ప తమిళ భాషలో మెడికల్, ఇంజినీరింగ్ విద్యాబోధన ఎంతవరకు ఆయా అభ్యర్థులకు భవిష్యత్‌లో ప్రయోజనం కలిగిస్తుందో, దాని వల్ల ఉద్యోగాలు తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎంతవరకు లభిస్తాయో ప్రశ్నార్థకమే. ఆంగ్ల (అల్లోపతి) వైద్య విద్యను హిందీలో బోధించే అధ్యాయానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2022 లో మధ్యప్రదేశ్‌లో తెరలేపారు. ముందుగా ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీలను హిందీలో బోధించాలని నిర్ణయించారు. ఇది స్థానిక వాదాన్ని బలపర్చడానికి బాగానే ఉన్నట్టు అనిపిస్తోంది. కానీ మధ్యప్రదేశ్‌లో హిందీలో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులు ఉద్యోగాల వేటలో ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు, ఉదాహరణకు దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లినప్పుడు వారి హిందీ వైద్య విద్య ఎంతవరకు ఆచరణలో ప్రయోజనం కలిగిస్తుందో చెప్పలేం. హిందీ పాఠ్యగ్రంథాల్లో కూడా అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ అనే పదాలను ఉన్నది ఉన్నట్టు హిందీలోనే రాశారని తెలుస్తోంది. ఆ పదాలను హిందీలో ఎందుకు అనువదించలేకపోయారు? అలా అనువదిస్తే ఎవరికైనా అర్థం అవుతుందా? ఆంగ్లంలో ప్రాచుర్యం పొంది, స్థానిక ప్రాంతీయ భాషల్లో కలిసి మన వ్యవహారాల్లో వాడుక అవుతున్న ఆంగ్ల పదాలకు అచ్చమైన తెలుగు పదాలు సరిగ్గా ఉండవు. ఉదాహరణకు రైలు అనే ఆంగ్లపదం ఎవరికైనా సులువుగా అర్థమవుతుంది. దానిని తెలుగులో ధూమశకటం అని పిలిస్తే ఎవరికీ అర్థం కాక గందరగోళం ఏర్పడుతుంది. తెలుగు మాధ్యమంలో చదువుకొన్న పట్టభద్రులు బయట ఉద్యోగాలు దొరక్క, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడలేక, అభాసుపాలైన ఉదంతాలు ఎన్నో కనిపిస్తాయి. ప్రాంతీయ భాషల్లో ఉన్నత చదువులు చెప్పొద్దని, చదవొద్దని, ఎవరూ అనరు. అది ఎంతవరకు ఉపయోగపడుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. ఉదాహరణకు తెలుగు మాధ్యమంలోని సైన్స్ పుస్తకాల్లో వెన్నెముక కలిగిన జంతువులకు కశేరుకాలు, వెన్నెముక లేని జంతువులకు అకశేరుకాలు అని అనువాదం చేశారు. అది ఎవరికీ అర్థంకాక జుత్తుపీక్కుంటున్నారు. ఇలాంటి పదాలు నేర్చుకుని తెలుగు మాధ్యమ విద్యార్థులు ఏ రకంగా ఉద్యోగాలు సంపాదిస్తారు? అలాగే ఆంగ్ల వైద్య పుస్తకాలను తమిళంలో కానీ, హిందీలో కానీ అనువదించడం రాజకీయ పన్నాగమే తప్ప ఎవరికీ వాస్తవంగా ఎలాంటి ప్రయోజనం ఉండబోదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వైద్యం లేదా ఇంజినీరింగ్ నిరంతరం జరిగే పరిశోధనల మీద, నూతన ఆవిష్కరణల మీద ఆధారపడి ఉంటాయి. కాలానుగుణంగా ఆధునికంగా వచ్చే పరిణామాల బట్టి బోధనాంశాలు మారుతుంటాయి. సాధారణంగా పరిశోధన గ్రంథాలు ఆంగ్లంలోనే ఉంటాయి. అలాంటప్పుడు ప్రజలకు అర్థం కాని రీతిలో మాతృభాషలోకి పాఠ్యగ్రంథాలను అనువదించడం ఆయా అభ్యర్థులకు హాని చేయడమే అవుతుంది. ఇంజినీరింగ్ విద్యను మాతృభాషల్లో బోధించాలని నాలుగేళ్ల క్రితం కేంద్రం నిర్ణయించింది. ఆ మేరకు తెలుగుతోపాటు మరో నాలుగు ప్రాంతీయ భాషల్లో ఇంజినీరింగ్ విద్యాబోధనను దేశంలోని 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలు, దళితులు ఇంజినీరింగ్ విద్యను సులభంగా నేర్చుకోడానికి ఇది తోడ్పడుతుందని సూచించారు. కానీ మాతృభాషల్లో ఇంజినీరింగ్ తదితర సాంకేతిక విద్యల బోధన అనే లక్షాన్ని సాధించాలంటే ఆంగ్లంలో ఉండే ఆయా పాఠ్యగ్రంథాలను విద్యార్థులు సులభంగా విద్యార్థులు అర్థం చేసుకునేలా ఆయా భాషల్లోకి అనువదింప చేయాలి. అలాగే మాతృభాషల్లో సాంకేతిక విద్యలు చదువుకున్న వారికి తప్పనిసరిగా మంచి ఉద్యోగాలు లభించేలా పాలకవర్గాలు బాధ్యత వహించాలి. అలా కాకుంటే ఆ వైఫల్యం మాతృభాషల్లో పైచదువులు చదువుకునే పిల్లల భవిష్యత్తుపై విపరీత ప్రభావం పడుతుంది. మాతృభాష గొప్పదే అయినా వాస్తవాలను పరిశీలిస్తే కిందిస్థాయి నుంచి పై వరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఆంగ్లంలో బోధించే ప్రైవేట్ పాఠశాలల్లోనే చేర్పించడం పరిపాటిగా సాగుతోంది. కొన్ని రాష్ట్రాలో ఒకటో తరగతినుంచే ఆంగ్లంలో బోధించే పద్ధతిని అనుసరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు అందరికీ లభించని పరిస్థితుల్లో విద్యావంతులైన యువత ప్రైవేట్ రంగం పైనే ఆధారపడక తప్పడం లేదు. విదేశీ ప్రైవేట్ సంస్థలైతే ఆంగ్ల మాధ్యమంలో చదువుకొనే వారికే ప్రాధాన్యం ఇస్తుండటం అందరికీ తెలిసిందే. ఆంగ్లంలో చదువుకున్న వారికి గల ఉద్యోగ అవకాశాలు మాతృభాషా మాధ్యమాల్లో చదువుకునే వారికి ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో తమిళనాడులో వైద్య, ఇంజినీరింగ్ విద్యాబోధనలను తమిళంలోనే అందించాలని కేంద్ర మంత్రి అమిత్ షా పట్టుపట్టడం చూస్తుంటే ఇదో పెద్ద రాజకీయా డ్రామా అనిపించక తప్పదు.

## చందర్ యాత్ర అభినందనీయం

గజ్వెల్,గోదావరి గోస పేరుతో గోదావరిఖని నుంచి ఎర్రవెల్లి వరకు పాదయాత్ర చేపట్టిన రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంఘీభావం ప్రకటించారు. ప్రజ్ఞాపూర్‌కు చేరుకున్న పాదయాత్ర వద్దకు వచ్చిన కల్వకుంట్ల కవిత గోదావరి గోస పాదయాత్రకు స్వాగతం పలికి ఈ సందర్భంగా కోరుకంటి చందర్‌ను అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి కుట్ర చేశాయని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు కలిసి మేడిగడ్డపై దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. బ్యారేజీకి పర్రె పట్టిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించడం, ఆ మరుసటి నాడే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏను పంపించడం వంటివి జరిగాయని గుర్తు చేశారు. మరి ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి నెల రోజులు గడుస్తున్నా... ఎన్డీఎస్ఏ వాళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనించాలని కోరారు. కాళేశ్వరం నీళ్లు వినియోగించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పొలాలను ఎండబెడుతూ రైతుల నోట్లల్లో మట్టికొడుతున్నదని ధ్వజమెత్తారు. లక్షాలది ఎకరాలు ఎండిపోతున్నా సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు చూస్తూ

# నూనె గింజల ఉత్పత్తిని పెంచాలి

న్యూఢిల్లీ, మన అసవరాలు తీరేలా, మనకు ఆహారాన్ని సమకూర్చేలా దేశీయ వ్యవసాయ విధానంలో మార్పులు రావాలి. వాణిజ్య పంటలను సాగు చేసే రైతులను భారీగా ప్రోత్సహించాలి. వాణిజ్య పంటల సాగుద్వారా లభించిన ఆదాయాన్ని ఆ కుటుంబాలకు చెందేలా చేస్తే వారికి పంటల సాగుపై ఆసక్తితో పాటు ఆదాయం కూడా వస్తుంది. ప్రధానంగా వంటనూనె గింజల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు పెంచాలి. ఇందులో నువ్వులు, వేరుశనగ, కొబ్బరి, కుసుమలు, పొద్దుతిరుగుడు ఉత్పత్తులకు ప్రోత్సాహకాలు ఇస్తే..రైతులు కూడా లాభపడతారు. దేశీయంగా వంటనూనెల ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే విదేశాల నుంచి నూనెల దిగుమతి చేసుకోవాల్సన ఖర్మ ఉండదదు. ఇంధనం, వంటనూనెలపై మనం విదేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తి చేసుకునే అవకాశాలను పాలకులు పరిశీలించడం లేదు. కనీసం వంటనూనెలకు అసవరమైన వేరుశనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమలను పండించి దేశానికి అసవరమైన ఉత్పత్తులు స్వయం సమృద్ధి సాధించాలన్న సంకల్పం పాలకుల్లో కనిపించడం లేదు. అసలు ఇలాంటి ఆలోచన పాలకుల్లో ఉన్నట్లుగా కూడా గోచరించడం లేదు. ఈ క్రమంలో మనం విదేశాలపై ఆధారపడడం, విపరీతంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయడం జరుగుతోంది. దీంతో మన సంపాదన అంతా విదేశాలకు తగులబెట్టాల్సి వస్తోంది. వాణిజ్య పంటల సాగు ఇప్పటి వరకు రైతులకు ఆర్థికంగా పెద్దగా దోహదం చేయడం లేదు. ప్రధానంగా వంటనూనెలను దేశీయంగా తయారు చేసుకోవాలి. అలాగే వంటనూనెల ఉత్పత్తికి అసవరమైన నూనెగింజల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ విధానంపై ఓ గట్టి నిర్ణయం తీసుకుని మనం వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. దీంతో అటు రైతులకు కూడా మేలు జరుగుతుంది. చౌడు నేలలను ప్రత్యామ్నాయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవచ్చు. ప్రత్యామ్నాయ పంటలు మనకు మరింత ప్రయోజనకరంగా ఉండేలా పాలకులు ఆలోచనలుచేయాలి. ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవడంలో భాగంగా మనకున్న సారవంతమైన నేలలను, నదీజలాలను ఉపయోగించి మన పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాలి.వరి, గోధుమ పంటల సాగు ఎండుగడ్డిని సమకూరుస్తుంది. ఇదే పశువులకు ముఖ్య ఆహారం. దీనివల్ల పాల ఉత్పత్తి పెరిగి బాలలకు పోషకాహారం సమృద్ధిగా లభించేందుకు దోహదం జరుగుతోంది. పాడిని, మాంసం కోసం కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకాన్ని కూడా పెంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

# మెట్రోరైల్ సమయం పొడిగింపు

హైదరాబాద్,హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించే పాసింజర్స్‌కు సమయాన్ని పొడిగిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు లాస్ట్ మెట్రో రైలు నైట్ 11 గంటలకు బయలుదేరి 12 గంటలకు గమ్యస్థానానికి రీచ్ అవుతుంది. ఇకపై చివరి మెట్రో రైలు 12 గంటల 15 నిమిషాలకు బయలుదేరి 1:10 నిమిషాలకు గమ్యం చేరుకోనుంది. అయితే ఇక్కడో ట్విస్ట్ ఉంది. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లలో మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. దీంతో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచులు వీక్షించేవారికి.. ఆ మార్గాల గుండా ప్రయాణించేవారికి ఈ సౌకర్యం ఉపయోగకరం. మార్చి 22న నుంచి –2025 సీజన్ స్టార్ట్ అవుతున్న క్రమంలో మెట్రో ఈ సౌకర్యాన్ని కల్పించింది. మార్చి 22 నుంచి ఈ ఐపీఎల్ సీజన్ ముగిసేవరకు ఆ స్టేషన్స్ గుండా లాస్ట్ ట్రైన్స్.. రాత్రి 12.15 గంటలకు స్టార్ట్ అయ్యి.. 1.10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని మెట్రో యాజమాన్యం వెల్లడించింది. భారత్‌లో బిగ్ క్రికెట్ ఫెస్టివల్ “ఐపీఎల్–2025” మార్చి 22 నుంచే స్టార్ట్ అవుతోంది. ఫస్ట్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్లు తలపడుతున్నాయి. తెలంగాణలోని ఐపీఎల్ అభిమానులకు ఈసారి మాములు బోనాంజా కాదు.. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం ఈ సీజన్‌లో మొత్తం 9 మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తోంది. హైదరాబాద్‌లో జరగనున్న 9 మ్యాచుల్లో 7 లీగ్ మ్యాచ్‌లు కాగా.. ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు 2 ఉన్నాయి. ఉప్పల్‌లో ఈ ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో హోమ్ టీమ్ సన్‌రైజర్స్.. రాజస్థాన్ రాయల్స్‌తో తలపడుతుంది. తొలి మ్యాచ్ మధ్యాహ్నం ప్రారంభమవుతుండగా.. హైదరాబాద్‌లో జరిగే మిగిలిన మ్యాచ్‌లన్నీ రాత్రి 7.30 గంటలకు స్టార్టవుతాయి. ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్చి 27న లక్నో, ఏప్రిల్ 6న గుజరాత్, ఏప్రిల్ 12న పంజాబ్, ఏప్రిల్ 23న ముంబై, మే 5న ఢిల్లీ, మే 10న కోల్‌కతా టీమ్స్‌తో తలపడుతుంది. ఇక మే 20న క్వాలిఫయర్–1, మే 21న ఎలిమినేటర్ మ్యాచ్‌లు ఉప్పల్‌లో జరుగుతాయి.

# ఏది దారి ?

విజయవాడ:ఆయన ఒంట్లో అంతా కాంగ్రెస్ రక్తమే ఉంది. భక్తి ఉంది అంటారా అది వైఎస్సార్ కుటుంబం మీదనే ఉంది. ఆయనే మోపిదేవి వెంకటరమణ. ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన వారు. ఆయనది మూడున్నర దశాబ్దాల రాజకీయ జీవితం. 1989, 1994లలో కూచిపూడి నుంచి అసెంబ్లీకి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు.అయితే 1999, 2004లలో అదే కూచిపూడి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వచ్చారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజనలో రేపల్లెకు ఆయన షిఫ్ట్ అయ్యారు. 2009లో అక్కడ నుంచి తొలిసారి గెలిచారు. 2014 నాటికి వైసీపీలో చేరి రేపల్లె నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. 2019లో అదే రిపీట్ అయింది. ఈ విధంగా చూస్తే ఆయన మొత్తం తన రాజకీయ జీవితంలో 2024లో తప్ప 1989 నుంచి ఏడు సార్లు పోటీ చేస్తే మూడు సార్లు మాత్రమే గెలిచారు.అయితే ఆయన వైఎస్సార్ మంత్రివర్గంలో కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో జగన్ మంత్రివర్గంలో కూడా మంత్రిగా పనిచేయడం విశేషం. శాసనమండలి రద్దు అని వైసీపీ నిర్ణయం తీసుకుంటే మోపిదేవిని రాజ్యసభకు 2020లో ఎంపిక చేశారు. అలా ఆయన పదవీ కాలం 2026 జూన్ వరకూ ఉంది.అయితే 2024లో రేపల్లె టికెట్ తనకు కానీ తన కుటుంబానికి కానీ ఇస్తారని ఆశించిన మోపిదేవి అది దక్కకపోవడంతో అసంతృప్తి చెందారు. వైసీపీ ఓటమి పాలు అయ్యాక ఆయన ఆగస్టులో తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. టీడీపీలో చేరారు. అయితే ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది అని అంటారు.ఇదిలా ఉంటే తాజాగా అయిదు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ అయినా టీడీపీ అందులో మూడు తీసుకున్నా మోపిదేవి పేరు ఏ దశలోనూ పరిశీలనకు రాలేదని అంటున్నారు ఇక రేపల్లెలో బలమైన నాయకుడిగా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. ఆయనను కాదని అక్కడ మోపిదేవికి రాజకీయ పెత్తనం ఇచ్చే చాన్స్ లేదు.మరో వైపు చూస్తే వైసీపీ ఎమ్మెల్సీలు రాజీనామా చేసినా ఆ ఖాళీలతో పాటు 2027లో మరిన్ని ఖాళీలు వచ్చినా మోపిదేవికి చాన్స్ దక్కుతుందా అంటే డౌటే అని అంటున్నారు. ఎందుకంటే ఆయనకు రేపల్లెలో కౌంటర్ పార్ట్ గా మంత్రి సత్యప్రసాద్ ఉన్నారు. ఆయన మోపిదేవి రాజకీయ ప్రాబల్యాన్ని ఆదిలోనే అడ్డుకుంటారు అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే వైసీపీలోనే మోపిదేవి కొనసాగి ఉంటే మరో ఏడాదిన్నర పాటు ఎంపీ పదవి ఉండేది కదా అని అంటున్నారు.

# నెలరోజులైనా మృతుల వెలికితీత ఏదీ

హైదరాబాద్,ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికులు చిక్కుకుపోయి నెల రోజులు గడుస్తున్నా వారు ఏమయ్యారో ఇప్పటికీ తెలియని పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీయడం తప్ప మిగిలిన ఏడుగురి జాడ గుర్తించలేకపోయారని విమర్శించారు. పొట్ట కూటి కోసం వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న వారిని తలుచుకుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. వెలికితీతలో ఎందుకింత జాప్యం జరుగుతోంది. దీనిలో ప్రభుత్వ వైఫల్యం కూడా ఉందని అన్నారు. ఈ ప్రమాదానికి, బాధిత కుటుంబాలు అనుభవిస్తున్న తీవ్ర వేదనకు సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి. సొరంగంలో చిక్కుకుపోయిన మిగతా కార్మికుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మంత్రులు చెప్పిన గడువు కూడా తీరింది. కానీ, సహాయక చర్యల్లో చెప్పుకోదగ్గ పురోగతి మాత్రం సాధించలేకపోయారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ స్పందించాలి. వారి జాడ గుర్తించాలి. నెల రోజులుగా ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై పూర్తి వివరాలు వెల్లడించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# హిందీరచయిత వికె శుక్లాకు జ్ఞానపీఠ్

న్యూఢిల్లీ,ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు శనివారం భారతదేశపు అత్యున్నత సాహిత్య గౌరవం జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. 59వ జ్ఞానపీఠ్ అవార్డు శుక్లాని వరించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి తొలిసారిగా ఈ అవార్డునను అందుకున్న వ్యక్తిగా నిలిచారు. 88 ఏళ్ల శుక్లా కథా రచయిత, కవి, వ్యాసకర్తగా ప్రసిద్ధి చెందారు. ఈ అవార్డును అందుకున్న 12వ హిందీ రచయితగా శుక్లా నిలిచారు. ఈ అవార్డుతో పాటు రూ. 11 లక్షల నగదు బహుమతి, సరస్వతి కాంస్య విగ్రహం, ప్రశంసా పత్రాన్ని ఇస్తారు. ప్రముఖ కథకురాలు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ప్రతిభా రే అధ్యక్షతన జరిగిన జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నునంచి ఈ అవార్డు అందుకున్న మొదటి రచయిత వినోద్ కుమార్ శుక్లా. హిందీ సాహిత్యం, సృజనాత్మక, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అత్యుత్తమ కృషికి ఈ గౌరవాన్ని ప్రదానం చేస్తున్నాము' అని కమిటీ– ఓ ప్రకటనలో తెలిపింది. విలక్షణమైన భాషా నిర్మాణం, భావోద్వేగ రచనలకు పేరుగాంచిన శుక్లా 1999లో తన 'దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతి థి' పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. 1961లో స్థాపించబడిన జ్ఞానపీఠ్ అవార్డును మొదట మలయాళ కవి జి. శంకర కురుప్‌కు 1965లో 'ఓడక్కుళల్' అనే కవితా సంకలనం కోసం ఇచ్చారు.

# మేకిన్ ఇండియాతో ఊదరగొట్టిన మోడీ

న్యూఢిల్లీ,మేక్ ఇన్ ఇండియా పథకం కేవలం పబ్లిసిటీ కోసమేనని మోడీ ప్రభుతాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. భారత్‌ని ప్రపంచ తయారీ కేంద్రంగా మారుస్తామన్న హామీ బిజెపి ఇప్పటికీ నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు. '2014లో భారత్‌ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారుచేస్తానని 10 హామీలిచ్చింది. వాటిల్లో బిజెపి ఏవీ నెరవేర్చలేదు. బిజెపి మేక్ ఇన్ ఇండియా అనే స్కీమ్‌ని డెలివరీ కంటే ప్రచారానికే ప్రాధాన్యతనిస్తుందనడానికి ఒక క్లాసిక్ ఉదాహరణ' అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మోడీ హయాంలోనే భారత్ తయారీ రంగంలో ఉపాధి, తయారీ వాటా మరింత దిగజారిందని ఖర్గే విమర్శించారు. పిఎస్‌యులు అమ్ముడవుతున్నాయి. ఎంఎస్‌ఎంఇలు ఇబ్బందులెదుర్కొంటున్నాయి. అధికార యంత్రాంగంలో అడ్డంకులు నిత్యకృత్యంగా మారాయి. భారతీయ ఎంటర్‌ప్రె న్యూర్స్ విదేశాలకు వెళ్లి అక్కడ కంపెనీలు ఏర్పాటు– చేస్తున్నారు. దీంతో ఎగుమ తులు పతనమవుతున్నాయి అని ఖర్గే ఆరోపించారు. గుర్తించిన 14 ప్రభుత్వ రంగాల్ని ప్రయివేటీకరణ చేసిన తర్వాత 12 రంగాలు ముందుకు సాగడంలో విఫలమైన తర్వాత కూడా.. 1.97 లక్షల కోట్ల విలువైన పిఎల్‌ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్)ని ప్రయివేటీ–కరణకే ప్రభుత్వం మొగ్గుచూపుతుందా? దీనికి సంబంధించి ఫేజ్ 1 ముగించిందా? గత 50 ఏళ్లలో లేనంతగా భారత్ ఎగుమతుల వాటా ఇప్పుడెందుకు కనిష్టస్థాయికి పడిపోయింది? అని ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యుపిఎ హయాంలో చరిత్రలో గుర్తుండిపోయే విధంగా భారత్ వేగంగా అభివృద్ధి చెందిదనేది వాస్తవం. నిజమైన ఆత్మనిర్భర్ భారత్ కాంగ్రెస్ హయాంలోనే ఉందని మోడీ గ్రహించొచ్చు అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు మీడియా నివేదికలను కూడా పోస్టుకు జత చేశారు.

# పాదయాత్రకు ప్లాన్ చేశారా?

హైదరాబాద్,తెలంగాణ పాలిటిక్స్‌లో బీఆర్‌ఎస్ లీడర్ల స్టేట్‌మెంట్స్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. 2024 ఎన్నికల్లో ఓడిన తర్వాత కొన్ని రోజులు మౌనంగా ఉన్న నేతలు.. తర్వాత నిత్యం ప్రజల్లోనే ఉంటూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై గళమెత్తుతూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అయితే రేపే ఎన్నికలు ఉన్నాయన్నట్లుగా రాజకీయ వేడిని రాజేస్తోంది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే జిల్లాల పర్యటన చేపట్టారు కేటీఆర్. మొదటి జిల్లా పర్యటనలోనే సూర్యాపేట వేదికగా కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాదిలో పాదయాత్ర చేస్తానని తెలిపారు. అలంపూర్ టు ఆదిలాబాద్.. వయా హైదరాబాద్ మీదుగా పాదయాత్ర రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేసుకున్నారట కేటీఆర్.అధికారమే లక్ష్యంగా..ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేలా కేటీఆర్ పాదయాత్ర ఉండబోతోందట. వచ్చే ఏడాది మొదలయ్యే ఈ పాదయాత్ర దాదాపు 100 నియోజకవర్గాలను కవర్ చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ..పదేళ్ల బీఆర్ఎస్ పాలనను గుర్తు చేస్తూ..మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట కేటీఆర్.15 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇలాంటి టైమ్‌లోనే ప్రజల్లోకి వెళ్లాలని ఫిక్స్ అయ్యారట గులాబీ నేతలు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం, ఆందోళనలు చేస్తూనే వచ్చే ఏడాది కేటీఆర్ పాదయాత్ర చేసేలా ప్లాన్ చేస్తోందట బీఆర్ఎస్ అధిష్టానం. అయితే కేటీఆర్ పాదయాత్ర వెనుక పెద్ద స్కెచ్చే ఉందన్న చర్చ జరుగుతోంది. పాదయాత్ర చేసిన నేతలు సీఎం అవుతారన్న సెంటిమెంట్ ఉంది.

ఇలా పాదయాత్ర చేసిన లీడర్లంతా సీఎంలు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి మొదలు చంద్రబాబు, జగన్, రేవంత్‌రెడ్డి ఇలా పాదయాత్ర చేసిన లీడర్లంతా సీఎంలు అయ్యారు. ఆ సెంటిమెంట్‌లో భాగంగానే కేటీఆర్ పాదయాత్రకు ప్లాన్ చేశారన్న టాక్ వినిపిస్తోంది.

# ఈవీఎంలపై ఆరోపణలను ఈసీ ఎందుకు ఉపేక్షిస్తోంది?




న్యూఢిల్లీ,"ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారు, వరుసగా ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. మళ్లీ పాత పద్ధతిలో పేపర్ బ్యాలెట్ తేవాల్సిందే, లేకుంటే వివిప్యాట్‌లు లెక్కించాల్సిందే" అని గత కొన్నేళ్లుగా కాంగ్రెస్‌తో సహా మరికొన్ని పార్టీలు ఆరోపిస్తూ డిమాండ్ చేస్తున్నాయి. ఆ మాట కొస్తే ఎన్నికల్లో ఓడిన ప్రతిసారి కొన్ని పార్టీలు చేస్తున్న విమర్శలు ఇవే. ఈ ఆరోపణలకు చెక్ పెట్టేది ఎలా? కేంద్ర ఎన్నికల సంఘం తన నిబద్ధతను, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను నిరూపించాల్సిన అవసరం లేదా..! ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట ఇది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల ద్వారానే ఓటింగ్ జరుగుతున్నా, అందరి అనుమానాలనూ నివృత్తి చేయడానికి వివిప్యాట్ సిస్టంను సమాంతరంగా కొనసాగిస్తోంది. మరి ఆ వివిప్యాట్‌లను లెక్కిస్తే సరిపోతుందిగదా..! ఇంకాఎవరికీ అనుమానం వుండదుకదా, అయినా సీఈసీ అందుకు ఒప్పుకోవడం లేదు. అసలు ఈవీఎంలు హ్యాకింగ్‌కు గురికావడం లేదని, అది అసాధ్యమని సీఈసీ వాదిస్తోంది.ఎన్నికలలో భారతదేశానికి అసాధారణ రికార్డు ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, యూఎస్‌ఏ వంటి ప్రజాస్వామ్య దేశాలు ఒకేసారి సార్వత్రిక ఓటు హక్కును ప్రవేశపెట్టలేకపోయినా, భారతదేశం ఎటువంటి సంకోచం లేకుండా దానిని అమలు చేసింది. భారతదేశ రాజ్యాంగ నిర్మాతలు ప్రతి పౌరుడి ఓటు హక్కుపై, ప్రజల శక్తిసామర్థ్యాలపై ఎంతో నమ్మకంతో ముందుకు సాగారు. భారతదేశంతో పాటు స్వాతంత్ర్యం పొందిన పలు దేశాలలో ప్రజాస్వామ్య వ్యవస్థలు కుప్పకూలాయి. భారతదేశంలో మాత్రం ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది.ఓటు విలువ ఆధారంగానే పార్టీలు అధికారం చేపడుతున్నాయి. అధికార పార్టీలు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతున్నాయా లేదా అన్నది మరో చర్చ. అయినా దేశంలో ఎన్నికల ప్రక్రియ మాత్రం సంస్కరణలను స్వాగతిస్తూ ముందుకు సాగుతోంది. దాని పర్యవసానమే ఈవీఎంలు. 1982లో తొలిసారి కేరళలో జరిగిన ఒక ఉప ఎన్నికతో ప్రారంభమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ప్రక్రియ ఆ తరువాత పూర్తిస్థాయిలో వినియోగానికి వచ్చింది. అయితే పలు దేశాలలో ఈవీఎంలతో పాటు పేపర్ బ్యాలెట్‌లను వినియోగిస్తున్నారు. నెదర్లాండ్స్, కజకిస్తాన్, ఐర్లాండ్ దేశాలు %జుఎవీ%లను ఉపయోగించడం మానివేశాయి.మన దేశంలో ప్రజాస్వామ్యానికి మచ్చ రాకుండా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడంలో కేంద్ర ఎన్నికల సంఘం ముందుంది. అయినా ఇటీవల వస్తున్న ఆరోపణలకు జవాబీయాల్సిన అవసరం ఉంది.ప్రముఖ ఎన్నికల సంస్కరణల సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఏడీఆర్ ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆరోపించింది. ఎన్నికల లెక్కింపు వేళ 543, 538 నియోజకవర్గాలలో పోలైన ఓట్ల కంటే తక్కువ లేదా ఎక్కువ ఓట్లు లెక్కించబడ్డాయని తన నివేదికలో స్పష్టంచేసింది. ఇదే నిజమైతే, మన ప్రజాస్వామ్యానికి మచ్చ పడ్డట్లే.ఏడీఆర్ రిపోర్ట్ ఆధారంగా ఈవీఎంలపై ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ప్రతిపక్ష నేత రాహుల్ ఎన్నికల్లో అవకతవకలను పార్లమెంట్ వేదికగా చర్చను లేవనెత్తారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఫలితాలపై కూడా అనుమానాలు లేవనెత్తారు. రాహుల్ ఆరోపణలను అధికార ఎన్డీయే ప్రభుత్వం ఖండించింది. నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడింది.తుది ఓటర్ల ఓటింగ్ శాతం డేటాను విడుదల చేయడంలో ఎందుకు విపరీతమైన జాప్యం జరుగుతోందని, తుది ఓటర్ల ఓటింగ్ శాతం డేటాను ప్రకటించే ముందే తుది ఫలితాలను ఎలా ప్రకటిస్తున్నారని ఎన్నికల సంఘాన్ని ఏడీఆర్ ప్రశ్నించింది. ఎన్నికల ఫలితాల తరువాత రెండున్నర నెలలకు కూడా ఫలితాల షీట్లు, ఫారం–20 ఆన్‌లైన్‌లో ఎందుకు పెట్టడం లేదంటోంది. ఏడీఆర్ వ్యవస్థాపకుడు జగదీప్ చోకర్ ఈ అంశంలో మాట్లాడుతూ 2019 , 2024 లోక్ సభ ఎన్నికలలో కనిపించిన ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో, ఆరోపణలపై వివరణ ఇవ్వడంలో ఈసీఐ విఫలమవడం వల్లే ప్రజలలోనూ అనుమానాలు వస్తున్నాయన్నారు.అయితే ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలు సరికాదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈవీఎంలు అత్యంత భద్రతతో కూడినవని, ఈవీఎంలపై సందేహాలు అక్కర్లేదని పేర్కొంది. ర్యాండమ్‌గా వీవీ ప్యాట్‌లలోని స్లిప్పులను లెక్కిస్తున్నామని, వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపులో ఇప్పటివరకు ఎక్కడా తేడా రాలేదని ఈసీ వాదిస్తోంది. అయితే, పోలింగ్ శాతం పెరుగుదలపైనా తప్పుడు ప్రచారం జరుగుతోందని, పోలింగ్ సమయం ముగిసే సమయానికి ఎంత పోలింగ్ శాతం నమోదైందో ఒకసారి ప్రకటిస్తున్నామని సీఈసీ రాజీవ్ కుమార్ తాజాగా వివరణ ఇచ్చారు. పోలింగ్ సమయం ముగిశాక, అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారు ఓటేస్తున్నారని, కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ జరుగుతోందని వెల్లడించారు. అందువల్ల పోలింగ్ శాతంపై చివరి లెక్కలు ఆలస్యంగా వస్తున్నాయని వివరించారు.ఈసీఐ ఇలాంటి గందరగోళాన్ని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. అయితే, దాని నిర్ణయాలు , చర్యలు ప్రజలలో దాని గౌరవాన్ని పెంచుతూనే ఉంది. టిఎన్ శేషన్ లాంటి వ్యక్తులు ఎన్నికల సంఘం ప్రాధాన్యతను ఎంతో పెంచారు. శేషన్ కాలంలో, ఆయన ఫోటోలతో కూడిన ఓటరు ఐడి కార్డులను ప్రవేశపెట్టి, మోడల్ ప్రవర్తనా నియమావళిని అమలు చేశారు. ప్రస్తుతం దొంగ ఓట్లకు అవకాశం లేకుండా ఆధార్ నెంబర్‌తో ఓటర్ కార్డును అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఈవీఎంలు హ్యాకింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు పోవడం లేదు.ఈవీఎం విషయానికొస్తే ఈసీఐ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో జరిగిన అనేక ఎన్నికలలో 22 సంవత్సరాలు జాగ్రత్తగా అధ్యయనం చేసి, వాటిని పూర్తిగా ఉపయోగించింది. బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎంలను ప్రవేశపెట్టడం వెనుక ఏకైక ఉద్దేశ్యం బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్, ఎన్నికల ప్రక్రియను, ఫలితాన్ని దెబ్బతీసే ఇతర చర్యలను అడ్డుకోవడమే. ఈవీఎంలు వచ్చాక గంటల వ్యవధిలో ఫలితాలు కూడా అందించగలుగుతున్నారు.అయితే, ఈవీఎంలను ప్రవేశపెట్టిన ఇన్ని సంవత్సరాల తర్వాత, మారిన సాంకేతిక పరిజ్ఞానంతో హ్యాకింగ్ ఆరోపణలు పెరుగుతున్నాయి. 2013లో మరింత పారదర్శకత పెంచేందుకు వివిప్యాట్ సిస్టం తెచ్చినా, ఇప్పుడు వాటిని లెక్కించాలన్న డిమాండ్ పెరుగుతోంది.ప్రస్తుతం, ఈసీఐ చేయాల్సిందల్లా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి తన పనిని కొనసాగించడమే. విమర్శలు, ఆరోపణలకు ప్రతిస్పందించకుండా, ఈసీఐ వచ్చి వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించడం ప్రారంభించవచ్చు. నిజానికి, ఓట్లను లెక్కించే ప్రస్తుత పద్ధతి, ఖచ్చితంగా చెప్పాలంటే ఈవీఎంలలో నమోదైన ఓట్లను మాత్రమే లెక్కించడం, కానీ భౌతిక లెక్కింపు కాదు.వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించడం ద్వారా వాటిని ఈవీఎం గణాంకాలతో సరిచూడడం ద్వారా ఈసీఐ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేమని నిరూపించవచ్చు. దీన్ని చేయడానికి ఈసీఐకి పట్టేది వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపుకు మరో రోజు సమయంతో పాటు మరికొన్ని వందల కోట్ల రూపాయల ఖర్చు. ఈ కొద్దిపాటి నిధులు సమయాన్ని ఖర్చు చేయడం ద్వారా ఆరోపణలకు చెక్ పెట్టి పారదర్శకతను పెంచే వీలుంది.2014 ఎన్నికల్లో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని బిజేపీ పార్టీ ఘనవిజయం సాధించడానికి ఈవీఎంల ట్యాంపరింగే కారణమంటూ ఓ వార్త వెల్లువెత్తింది. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు లండన్‌లో జరిగిన ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ నుంచి విడుదలైన ఈ వార్త భారతదేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపింది. అంతేకాకుండా రాజకీయ రంగాన్ని ఒక్క కుదుపు కుదిపింది. తక్కువ ఫ్రీక్వెన్సీ ఉన్న సిగ్నల్స్ ద్వారా హ్యాక్ చేశారని ఆయన ఆరోపించారు. సైబర్ నిపుణుడుగా చెప్పుకున్న సయ్యద్ సుజా ఈవీఎంలను హ్యాకింగ్ చేసి చూపిస్తానని చెప్పినా, నిరూపించ లేకపోవటం, ఈసీ సవాల్ స్వీకరించక పోవడంతో అప్పట్లో ఆ వివాదం సద్దుమణిగింది. బ్లూటూత్ ఆప్షన్ కూడా లేకుండా పనిచేసే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని ఎన్నికల సంఘం అంటోంది. అందుకే వీవీప్యాట్‌ల లెక్కింపుకు ససేమిరా అంటోంది.

# పోరాటాల గడ్డపై అందాల సంబురం




సెంట్రల్ డెస్క్, అదిరేటి డ్రెస్సు మేమేస్తే.. బెదిరేటి లుక్కు మీరిస్తే దడ.. మీకు దడ.. సరదాగ ర్యాంప్ ఎక్కిన వనితేలే నేటి సెన్సేషన్.. కన్నె చూపుల్లో ఉన్నదిలే సూపర్ టెంప్టేషన్ ఈ పాట వింటుంటే కుర్రకారుకే కాదు, సడుగులిరిగిన సింగార బాబులకూ గుండెదడ తప్పదేమో. ఇక.. భారీ ర్యాంప్‌పై 140 దేశాల అందెగత్తెల వయ్యారాలు ఒలకబోస్తుంటే చూసి తరించని వారుండరేమో. వారి వంపు సొంపులు, వయ్యారాల నడకలు.. చిరునవ్వుల పలకరింపులు.. కొంటె చూపులు అందరినీ మరో లోకంలోకి తీసుకెళ్లనున్నాయి. ఈ అందాల విందుకు విశ్వగనగరి భాగ్యనగరం వేదిక కాబోతోంది.

21 ప్రదేశాల్లో 23 థీమ్‌లతో ఈవెంట్లు..

అందం, ప్రతిభను చాటడమే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వైభవం, సంప్రదాయలతో పాటు పర్యాటక ప్రాంతాల అందచందాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం రాష్ట్రానికి దక్కుతోంది.'తెలంగాణజరూర్ ఆనా' (తెలంగాణకు తప్పక రండి) అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. మే 10వ తేదీన హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభమైన ఈ వేడుక మే 31వ తేదీన హైటెక్స్ లో గ్రాండ్ ఫినాలేతో ముగుస్తుంది.మొత్తం 21 ప్రదేశాల్లో 23 థీమ్ లతో ఈవెంట్లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విస్తృతమైన అంతర్జాతీయ మీడియా కవరేజీ, లక్షలాది మంది ప్రపంచ వీక్షకులతో ఈ ఫెస్టివల్ హైలెట్ కాబోతుందని వివరించారు. 24 రోజుల పండుగ ఇలా మే 31న హైటెక్స్ లో జరిగే గ్రాండ్ ఫినాలేకు ముందు జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పోటీదారులు మే 6, 7 తేదీల్లో నగరానికి చేరుకుంటారు.మే నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ జానపద, గిరిజన నృత్యాలతో తెలంగాణ ఆటపాటలతో ఘనంగా ప్రారంభోత్సవం జరగనుంది. ఈ పోటీల్లో భాగంగా బుద్ధవనం, చౌమహల్లా ప్యాలెస్, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట ఆలయం, పోచంపల్లి తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారు.మెడికల్ అవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లోని ప్రధాన ఆస్పత్రులను అందగత్తెలు సందర్శిస్తారు. మే 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ఫినాలే జరగనుంది. కాంటినెంటల్ గ్రూపుల్లో కంటెస్టెంట్లను జడ్జ్ చేసే కాంటినెంటల్ ఫినాలే మే 20, 21 తేదీల్లో టీ–హబ్ లో జరగుతుంది.మే 22న శిల్పకళావేదికలో మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలే, 23న ఐఎస్ బీలో హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్ జరుగుతాయి. మే 24న హైటెక్స్ లో మిస్ వరల్డ్ టాప్ మోడల్, ఫ్యాషన్ ఫినాలే, 25న జువెలరీ అండ్ పెర్ల్ షో నిర్వహించనున్నారు. ఫైనల్ గా మే 31న హైటెక్స్ లో మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలే లో విజేతకు కిరీటం దక్కుతుంది.

అంత ఖర్చు అవసరమా? :

కేటీఆర్ మిస్ వరల్డ్ ఈవెంట్ కోసం ?200 కోట్లు ఖర్చు చేస్తున్నారని.. రాష్ట్ర ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం చెల్లించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఫార్ములా–ఈ రేస్ కోసం రూ.46 కోట్లు ఖర్చు చేస్తే కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. కానీ రూ.200 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి మిస్ వరల్డ్ పోటీ నిర్వహించడం కరెక్టేనా..? అంటూ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు.

ఖర్చు27 కోట్లే.. ప్రభుత్వం సమాధానం

మిస్ వరల్డ్ అందాల పోటీల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేస్తోందన్న ఆరోపణలను పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ తోసిపుచ్చారు. ప్రభుత్వం కేవలం రూ.27 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందని%ొా% ఈ కార్యక్రమానికి వచ్చే నిధుల్లో ఎక్కువ భాగం కార్పొరేట్ స్పాన్సర్‌షిప్స్ నుంచే వస్తున్నాయని ఆమె గురువారం మీడియా సమావేశంలో చెప్పారు.భారతీయ విశ్వ సుందరీమణులు వీరే ..72 ఏళ్ల మిస్ వరల్డ్ పోటీల చరిత్రలో ఇప్పటికి ఆరుగురు భారతీయ ముద్దుగుమ్మలు ప్రపంచ సుందరీమణులుగా వెలిగారు. గోవా అందగత్తె రీటా ఫారియా పావెల్ చరిత్ర సృష్టించింది. 1966లో ర్యాంప్ పై తొలి ఆసియా వైద్యురాలిగా రికార్డుతో మిస్ వరల్డ్ కిరీటాన్ని అందుకుంది. 1994లో ఐశ్వర్య రాయ్ విశ్వసుందరిగా నిలిచింది. 1997లో భారతీయ మోడల్ డయానా హెడెన్ మిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. 1999లో భారతీయ మోడల్ యుక్తాముఖీ మిస్ వరల్డ్ రేస్ లో విజేతగా నిలిచింది. 2000లో బొంబాయి తార ప్రియాంక చోప్రా తో భారతీయ సుందరీమణుల చరిత్రను సృష్టించింది. ఆ తరువాత 2017లో హర్యానా ముద్దుగుమ్మ మాపుషి చిల్లర్ విశ్వసుందరీ కిరీటాన్ని ముద్దాడింది.

# భర్తను చంపి ప్రియుడితో మజా

లక్నో,ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో వెలుగు చూసిన మర్చంట్ నేవీ మాజీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో మరిన్ని ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. హత్య అనంతరం తమ కదలికలను ఎవ్వరూ గుర్తించకుండా అతడి భార్య, ఆమె ప్రియుడు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. ఇకపోతే ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించి త్వరగా శిక్ష పడేలా యత్నిస్తున్నారు. సౌరభ్ హత్య కేసుకు సంబంధించి ముస్కాన్, సాహిల్‌లకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిగేలా చూస్తామని సీనియర్ పోలీసు అధికారి మీడియాకు వెల్లడించారు. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగియగానే తమ కస్టడీలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఛార్జిషీటు దాఖలు చేయడాన్ని ప్రాధాన్యంగా తీసుకున్నామని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. అయితే హత్య తరవాత ముస్కాన్, సాహిల్÷–లు హిమాచల్‌ప్రదేశ్ కసోల్‌లోని ఓ హోటల్‌లో భార్యా భర్తలుగా చెప్పుకొని ఆరు రోజులు గడిపినట్లు వెల్లడైంది. ప్రియుడు సాహిల్‌తో కలిసి భర్త సౌరభ్ శుక్లాను మార్చి 4న ముస్కాన్ హత్య చేసింది. మత్తుమందు ఇచ్చిన తర్వాత ఈ దారుణానికి ఒడిగట్టినట్లు– తెలిసింది. మృతదేహాన్ని ముక్కలుగా నరికి, డ్రమ్‌లో పెట్టి సిమెంట్‌తో సీల్ చేశారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లారు. భార్యా భర్తలుగా చెప్పుకుని కసోల్‌లోని ఓ హోటల్‌లో మార్చి 10న దిగారు. అక్కడే ఆరు రోజులు ఉండి 16వ తేదీన వెళ్లిపోయారు. వారితోపాటు ఓ డ్రైవర్ కూడా ఉన్నట్లు– హోటల్ యజమాని పోలీసులకు వెల్లడించాడు.సాధారణంగా హిమాచల్‌కు వచ్చే టూరిస్టులు కొత్త ప్రదేశాలు చూస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తుంటారు. కానీ, ఈ జంట మాత్రం రోజు మొత్తం హోటల్‌లోనే గడిపారని, కేవలం రోజులో ఒక్కసారి మాత్రమే బయటకు వెళ్లేవారని హోటల్ యజమాని పేర్కొన్నాడు. అలా చేయడం అసాధారణంగానే అనిపించిందని, కనీసం రూమ్ శుభ్రం చేసేందుకు సిబ్బందిని కూడా గది లోనికి రానివ్వలేదని చెప్పాడు. హోటల్ నుంచి వెళ్లిపోయేటప్పుడు.. తాము మనాలీ నుంచి వచ్చామని, యూపీకి వెళ్తున్నామని చెప్పినట్లు తెలిసింది.

# ఇద్దరు వ్యాపారులమోసం చేసిన కేటుగాడు

హైదరాబాద్, ఇద్దరు వ్యాపారుల దృష్టి మరల్చిన కేటుగాడు ఏకంగా అర కిలో బంగారం, 18 వేల అమెరికన్ (యూఎస్) డాలర్లు ఎత్తుకెళ్లాడు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నార్సింగి ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఆన్‌లైన్‌లో గోల్డ్ బిజినెస్ వ్యాపారం చేస్తుంటారు. నల్లగండ్లకు చెందిన రఫీ మనీ ఎక్స్ఛేంజ్ వ్యాపారం చేస్తుంటారు. అయితే వారిద్దరికీ స్టీఫెన్ అనే పేరుతో ఓ వ్యక్తి శుక్రవారం ఫోన్ చేశాడు. బంగారం, అమెరికన్ డాలర్లు కొంటానని చెప్పాడు. గచ్చిబౌలి సెంట్రో మాల్‌లో కలుద్దామని వారిని అక్కడికి రప్పించాడు. బాధితులను మాల్ లోపల ఓ రూమ్‌కి తీసుకెళ్లాడు కేటుగాడు. అనంతరం వారి నుంచి గోల్డ్ బిస్కట్లు, డాలర్లు తీసుకున్నాడు. వారిద్దరినీ అక్కడే ఉండమని, తాను వెళ్లి ఒక్క నిమిషంలో నగదు తెస్తానని చెప్పాడు. స్టీఫెన్ మాటలు నమ్మిన బాధితులిద్దరూ అక్కడే కూర్చుండి పోయారు. ఎంతకీ రాకపోవడంతో మాల్ మొత్తం వెతికారు. అయినా స్టీఫెన్ జాడ మాత్రం తెలియలేదు. దీంతో మోసపోయామని గుర్తించిన చంద్రశేఖర్, రఫీ.. గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి స్టీఫెన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితుడి వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా అతను ఎవరనే విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్టీఫెన్ పాత నేరస్థుడా లేదా కొత్తగా మోసాలు మ్నొదలుపెట్టాడా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# ఇప్పుడెందుకు సైలెంట్ అయినట్లు?

హైదరాబాద్,అనేక అంశాల్లో హైడ్రా లక్ష్యం ఏంటో ఇప్పుడు ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఉంది.హడలెత్తించింది.. కొన్నాళ్లుగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రారంభించిన నెల, రెండు నెలలు వరకు హైడ్రా చేసిన హల్‌చల్ అంతాఇంతా కాదు. ఏమైందో ఏమో కానీ ఇప్పుడు హైడ్రా సైలెంట్ అయిందన్న చర్చ జరుగుతోంది. హైడ్రా స్టార్ట్ అయినప్పుడు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోతుందనే విమర్శలు ఉన్నాయి. సినీ హీరో నాగార్జున ఎన్.కన్వెన్షన్ నేలమట్టం చేసి పబ్లిక్ దృష్టిని ఆకర్షించింది హైడ్రా. ఆ తర్వాత ఓల్డ్ సిటీలో ఒక ఎమ్మెల్సీ నిర్మాణం కూల్చివేశారు.దాంతో హైడ్రాకు ఒక్కసారిగా మద్దతు పెరిగింది. ఇక చందానగర్ సర్కిల్..నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్..దుండిగల్ మున్సిపల్ పరిధిలో.. అన్ని అనుతులు ఉన్న నిర్మాణాలను కూడా హైడ్రా అధికారులు కూల్చివేశారు. కూకట్‌పల్లి నల్లచెరువు దగ్గరలోని అమీన్‌పూర్‌లో పేదలు, మధ్య తరగతి కుటుంబాలు లోన్లు పెట్టి కొన్న ఇండ్లను కూల్చివేసి హైడ్రా తీవ్ర విమర్శల పాలైంది.ఒకటి రెండు అంశాల్లో హైడ్రాకు మద్దతు లభించినా..ఆ తర్వాత హైడ్రా తీరుపై వ్యతిరేకత వ్యక్తం అవుతూ వస్తోంది. ప్రతిపక్ష పార్టీలు హైడ్రా చర్యలను తీవ్రంగా ఖండించాయి. హైడ్రా అధికారుల తీరును మొదట్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎండగట్టారు. బీజేపీ ఈటల రాజేందర్ కూడా పేదల ఇళ్లను కూల్చడంపై తీవ్రంగా స్పందించారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ అయితే ట్యాంక్ బండ్, సెక్రటేరియట్, హైడ్రా ఆఫీస్ కూడా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది కూలుస్తారా అంటూ హైడ్రాను నిలదీశారు.

హైడ్రాపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత

విమర్శలు వచ్చిన సందర్భాల్లో హైడ్రా స్పందించిన తీరు ఇంకా విమర్శలకు దారి తీసింది. నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేయడంతో హైడ్రాపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. దాంతో చెరువులు నాళాల పరిధిలో కట్టిన నిర్మాణాల్లో అప్పటికే పబ్లిక్ ఉంటే వాటిని కూల్చమంటూ చెప్పుకొచ్చారు. చట్టం ప్రకారం తాము ముందుకు వెళ్తామని చెప్పిన హైడ్రా కమిషనర్ ఆ తర్వాత ఎందుకు వెనక్కి తగ్గారనే దానిపై చాలా డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. అయితే పేదలను కూల్చివేసిన హైడ్రా అధికారులు..కొన్ని నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోకుండా పర్మిషన్లు ఉన్నవాటి జోలికి వెళ్లబోమంటే చెప్పడం విమర్శల పాలు చేసింది. ఆయా సందర్భాల్లో వస్తున్న పొలిటికల్ ప్రెజర్స్ ప్రకారం హైడ్రా పనిచేస్తూ పోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు పబ్లిక్. ఇక ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హైడ్రాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫిర్యాదు చేస్తే ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదని తాను చేసిన ఫిర్యాదుల్ని పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు. ఇలా ప్రతిపక్షాలే కాదు అధికార పక్షం కూడా రంగనాథ్ ఆరోపణలు, విమర్శలు ఫేస్ చేస్తున్నారు.ఇక ప్రజలు ప్రజాప్రతినిధులు మాత్రమే కాదు హైకోర్టు కూడా పలుమార్లు హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అమీన్‌పూర్ దగ్గర నిర్మాణాల కూల్చివేతకు తహశీల్దార్‌కు తాము సహకరించామని అని హైడ్రా కమిషనర్ చెప్పిన వ్యాఖ్యలపై సీరియస్‌గా రియాక్ట్ అయింది కోర్టు. చాంద్రాయణగుట్ట తహశీల్దార్ అడిగితే హైకోర్టును కూల్చడానికి కూడా సహకరిస్తారా అంటూ హైడ్రాను సూటిగా ప్రశ్నించింది.

# ఏక్‌నాథ్‌షిండేపై కమెడియన్ అనుచిత వ్యాఖ్యలు..




ముంబై:మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. షిండేను ఉద్దేశించి దేశద్రోహి అంటూ చేసిన వ్యాఖ్యలు ఆగ్రహానికి దారి తీశాయి.షిండే అభిమానులు, శివసేన కార్యకర్తలు హాస్య నటుడుకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. ఇక కునాల్‌కు సంబంధించిన కార్యాలయంపై శివసేన కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. కునాల్‌ను అరెస్ట్ చేయాలంటూ పెద్ద ఎత్తున నిసనలు చేపట్టారు.ఉద్ధవ్ ఠాక్రే నుంచి కునాల్ కమ్రా డబ్బులు తీసుకున్నారని.. అందుకే ఏక్‌నాథ్ షిండేను టార్గెట్ చేస్తున్నారని లోక్‌సభ ఎంపీ నరేష్ మ్హాస్కే ఆరోపించారు. కునాల్ ఒక కాంట్రాక్ట్ కమెడియన్ మండిపడ్డారు. డబ్బుల కోసం తమ నాయకుడిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని నరేష్ మ్హాస్కే ధ్వజమెత్తారు. మహారాష్ట్రలోనే కాదు.. కునాల్ దేశంలో ఎక్కడా స్వేచ్ఛగా తిరగలేడని హెచ్చరించారు. శివసేన సైనికులు అతన్ని వెంటాడుతూనే ఉంటారని వార్నింగ్ ఇచ్చారు.ఇక శివసేన కార్యకర్తల దౌర్జన్యంపై శివసేన(యూబీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే ఖండించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ ధ్వజమెత్తారు. ఇక శివసేన కార్యకర్తలు చేసిన విధ్వంసానికి సంబంధించిన దృశ్యాలను శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో ఒక బలహీనమైన హోంమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఉన్నారని ఆరోపించారు. మహారాష్ట్ర రాజకీయాలపై కునాల్ వ్యంగ్య పాట రా శారని.. దానికి షిండే అభిమానులు కునాల్ ఆస్తులపై ధ్వంసం చేయడం దారుణం అన్నారు.

### ఘనంగా అగ్నిగుండాలు.. ముగిసిన కొమురవెల్లి మల్లన్న జాతర

సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల (మల్లన్న జాతర) ముగింపు ఘనంగా జరిగింది. చివరి ఆదివారం అర్ధరాత్రి దాటిన అనంతరం అగ్నిగుండాలను ఆలయ బృందాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం స్వామివారిలో పూజలు నిర్వహించిన అర్చకులు సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఉత్సవ విగ్రహాలు ఆలయం తీసుకొచ్చి అగ్నిగుండాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అర్చకులు ఉత్సవ విగ్రహాలను పట్టుకుని అగ్నిగుండాలు దాటిన తర్వాత.. భక్తులు అగ్నిగుండాలు దాటి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాల భక్తులు దరఖాస్తు పెద్దసంఖ్యలో. దీంతో మూడు నెలలుగా సాగుతున్న బ్రహ్మోత్సవాలకు అగ్నిగుండాల ప్రవేశంతో ముగింపు పలికినట్లయింది.భక్తుల కొంగుబంగారమై కొమురవెల్లి బల్లన్న బ్రహ్మోత్సవాలు జనవరి 19న ప్రారంభమయ్యాయి. మూడు నెలల పాటు సాగిన జాతర.. ఉగాదికి ముందు వచ్చే ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఆదివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి.

# పెరుగుతున్న విద్యుత్ వాడకం..వేసవి డిమాండ్‌తో అధికారుల అప్రమత్తం



హైదరాబాద్, వేసవి ప్రారంభంతో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ఇది ఏటా జరిగగే ప్రక్రియే. నిరతంర విద్యుత్ సరఫరా కారణంగా ప్రజలు కూడా బిల్లులకు వెరవకుండా వాడేస్తున్నారు. గత నాలుగైదు రోజులు వాతావరణంలో కొంత మార్పుతో చల్లగా ఉన్నా మళ్లీ ఎండవేడిమి అందుకుంది. దీంతో వినియోగంలో ఆల్‌టైమ్ రికార్డు త్వరలో నమోదుకానుందని విద్యుత్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ వచ్చిన నాటి పరిస్థితితో పోల్చుకుంటే ప్రస్తుతం డిమాండ్ అధికమని అంటున్నారు. మున్ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. విద్యుత్ ప్రసారంలో సమస్యలు రాకుండా చూడాలని సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కొందరు విద్యుత్ సమస్యలు సృష్టించాలని చూసినా..వెంటనే గుర్తించి అలాంటి వారికి కత్తెర వేశారు. విద్యుత్ వినియోగం పెరగనుండడంతో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో కరెంటు డిమాండ్ ఆల్ టైమ్ రికార్డుకు దగ్గర్లో ఉంటోంది. అయితే గతేడాది అత్యధికంగా నమోదైన విద్యుత్ డిమాండ్.. ఈ ఏడు ఇప్పటికే అధికమించింది. ఈ నెలాఖరు లోగా 14 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో అంతకుమించి విద్యుత్ డిమాండ్ పెరిగింది. అప్పటితో పోలిస్తే కరెంటు కనెక్షన్లు కూడా పెరిగాయి. దీంతో ఎండాకాలం ప్రారంభంలోనే రాష్ట్రంలో కరెంట్ డిమాండ్ పెరుగుతోందని అధికారులు అంటున్నారు. ఇటు ఉక్కపోత కూడా ప్రారంభం కానుండడంతో కొన్ని రోజుల్లోనే కరెంటు వినియోగం భారీగా అవకాశం ఉందని లెక్క కడుతున్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు విద్యుత్ శాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. అలాగే విద్యుత్ నష్టాలను తగ్గించడం కోసం నాణ్యత కలిగిన మీటర్ల ఏర్పాటు, అధిక సామర్థ్యం ఉన్న కండక్టర్లు మార్చడం వంటివి చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఏడాదికి వెయ్యి యూనిట్లకు పైగా తలసరి విద్యుత్ వినియోగం జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా 10 శాతం వృద్ధిరేటు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

# వక్ఫ్ బిల్లు.. రాజ్యాంగంపై దాడి!



న్యూఢిల్లీ,కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యాంగంపై దాడిగా కాంగ్రెస్ పేర్కొంది. శతాబ్దాల కాలం నుంచి బలంగా ఉన్న మన దేశ బహుళ మత సమాజ సామరస్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ నిరంతరంగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దీన్ని తీసుకొచ్చారని ఆరోపించింది. తప్పుడు ప్రచారం చేయడం, దురభిప్రాయాలను సృష్టించడం ద్వారా మైనారిటీ వర్గాలను బూచిగా చూపేందుకు బీజేపీ యత్నిస్తోందని విమర్శించింది. వక్ఫ్ బిల్లు పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్‌లను నిర్వహించేందుకు గత చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన సంస్థల స్థాయి, అధికారాన్ని తగ్గించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ ప్రయోజనాల కోసం భూమిని ఎవరు దానం చేయవచ్చో నిర్ణయించడంపై ఉద్దేశపూర్వకంగా అస్పష్టత ఇచ్చారని, వక్ఫ్ నిర్వచనాన్నే మార్చారని రమేశ్ ఆరోపించారు. వక్ఫ్ పాలనను బలహీనం చేసేందుకు ప్రస్తుతం ఉన్నచట్టంలోని నిబంధనలు తొలగించారని, వక్ఫ్ భూములను అక్రమించిన వారికి రక్షణ కల్పించేలా మార్పులు చేశారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులపై వివాదాలు, వాటి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అం?శాలపై కలెక్టర్లు, నియమించిన ఇతర రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విశేష అధికారాలు కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు.

బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్టు ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రకటించింది. ఈ నెల 17న ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శన విజయవంతం కావడంతో జాతీయస్థాయి ఆందోళన జరపాలని కార్యాచరణ రూపొందించినట్టు తెలిపింది. ఇందుకోసం 31 మందితో యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. మొదట దశలో భాగంగా ఈ నెల 26న పట్నాలోని అసెంబ్లీ ఎదుట, 29న విజయవాడ (అమరావతి)లోని అసెంబ్లీ ఎదుట ధర్నాలు చేయనున్నట్టు తెలిపింది. 'వక్ఫ్ బిల్లుకు మద్దతు ఉపసంహరించండి...లేకుంటే మా మద్దతును కోల్పోతారు' అన్న సందేశాన్ని బీజేపీ మిత్ర పక్షాలకు పంపించడమే ఈ ధర్నాల ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ప్రదర్శనలను జరుపుతామని, ముఖ్యంగా హైదరాబాద్, ముంబయి. కోల్‌కతా, బెంగళూరు, మలేర్‌కోట్లా (పంజాబ్), రాంచీల్లో భారీ ఊరేగింపులు ఉంటాయని వివరించారు.

# ప్రాథమిక ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు జరపాల్సిందే



న్యూఢిల్లీ,ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి.. సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన నివేదిక ద్వారా పలు కీలక అంశాలు బయటపడ్డాయి! ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఈ వ్యవహారం గురించి మార్చి 15 సాయంత్రం తెలియగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆయన ఈ విషయాన్ని సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి పొద్దుపోయాక సుప్రీంకోర్టు అప్‌లోడ్ చేసిన 25 పేజీల డాక్యుమెంట్‌లో రెండో పేజీలోనే ఈ విషయం స్పష్టంగా ఉంది. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్‌రూమ్‌లో సగం తగలబడిపోయిన డబ్బు కట్టలున్న నాలుగైదు గోనెసంచులున్నట్టు ఢిల్లీ పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, సీజేఐకి ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదిక, వారి మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు, ప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లో డబ్బుకట్టలున్న ఫొటోలు, వీడియో లింకుతో సహా.. మొత్తం 25 పేజీల పీడీఎఫను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఇందులో జస్టిస్ ఉపాధ్యాయసీజేఐకి ఇచ్చిన నివేదికలో పలు కీలక విషయాలు ఉన్నాయి.మార్చి 15 సాయంత్రం 4.50 గంటల సమయంలో లఖ్‌నవూలో ఉన్న తనకు వెల్లడించారని తెలిపారు. అదే రోజు తాను ఆ విషయాన్ని సీజేఐ దృష్టికి తీసుకువెళ్లిన విషయాన్నీ అందులో ప్రస్తావించారు. ప్రమాదం జరిగిన రోజు జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారని.. అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయలేదని జస్టిస్ ఉపాధ్యాయ స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లోకి ఎవరో బలవంతంగా ప్రవేశించిన ఆనవాళ్లేవీ లేవని.. జస్టిస్ వర్మ కుటుంసభ్యులకు, పనివారికి మాత్రమే దాంట్లోకి ప్రవేశం ఉందని తేల్చిచెప్పారు. ఆ గదికి తాళం కూడా ఉందన్న విషయాన్ని.. 15వ తేదీ ఉదయం ఆ గది నుంచి సగం కాలిన వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించిన విషయాన్ని.. అక్కడున్న సెక్యూరిటీ గార్డ్ ధ్రువీకరించాడని వెల్లడించారు. ఘటనాస్థలికి వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిందిగా తనకు కేటాయించిన రిజిస్ట్రార్ కమ్ సెక్రటరీని ఆదేశించానని.. లఖ్‌నవూ నుంచి వచ్చాక, 16వ తేదీన తాను స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించానని చెప్పారు. అనంతరం సీజేఐని కలిసి వివరాలు సమర్పించినట్టు వెల్లడించారు. సీజేఐ ఆదేశాల మేరకు జస్టిస్ యశ్వంత్ వర్మతో ఫోన్‌లో మాట్లాడానని, 17వ తేదీన ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన తనను కలిశారని చెప్పారు."మంటలు చెలరేగిన స్టోర్ రూమ్‌లో పనికిరాని వస్తువులు, పాడైపోయిన గృహపకరణాలు, పాత ఫర్నిచర్, పరుపుల వంటివాటిని పడేస్తాం. పనివారికి, తోటపని చేసేవారికి కొన్ని సందర్భాల్లో సీపీడబ్ల్యూడీ (కేంద్ర ప్రజాపనుల విభాగం) సిబ్బందికి కూడా ఆ గది అందుబాటులో ఉంటుంది" అని జస్టిస్ వర్మ తనకు చెప్పినట్టు వెల్లడించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ తనకు వాట్సాప్ ద్వారా షేర్ చేసిన ఫొటోలు, వీడియోలను (సగం కాలిన నోట్ల కట్టల తాలూకా) చూపించగా.. అదంతా తనపై జరుగుతున్న కుట్రగా జస్టిస్ వర్మ పేర్కొన్నారని వివరించారు. 20వ తేదీన ఆ ఫొటోలు, వీడియోలను సీజేఐకి పంపినట్టు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదన గురించి తనకు సీజేఐ నుంచి సమాచారం వచ్చిందని, అందుకు తాను అంగీకరించానని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వివరాలు, జస్టిస్ వర్మ స్పందన, పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, తాను జరిపిన విచారణ ప్రకారం.. ఆ గదిలోకి పనివారు, తోటపనివారు, కుటుంబసభ్యులు, సీపీడబ్ల్యూడీ సిబ్బందికి తప్ప బయటివారెవరికీ ప్రవేశం లేదని తేల్చిచెప్పారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.

ఈ ప్రశ్నలు అడగండి..

ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా..అసలు జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో దొరికిన డబ్బుకు ఆయనకు సంబంధమేమిటి?స్టోర్ రూమ్‌లో కనిపించిన నగదు ఎక్కణ్నుంచీ వచ్చింది? దాని మూలమేమిటో వివరించాలి?మార్చి 15వ తేదీ ఉదయం.. సగం తగలబడిన నోట్లను ఎవరు తొలగించారు?...అనే మూడు ప్రశ్నలూ జస్టిస్ వర్మను అడిగి, మార్చి 22 మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆయన్నుంచి లిఖితపూర్వక సమాధానం తీసుకోవాలంటూ జస్టిస్ ఉపాధ్యాయకు లేఖ రాశారు. అలాగే, గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత భద్రతాధికారుల వివరాలను, ఆయన ఇంటివద్ద విధులు నిర్వర్తిస్తున్న భద్రతా

# దేశ రాజకీయాల్లో 'గ్రోక్' ప్రకంపనలు.. బీజేపీని ఇరుకున పెడుతున్న చాట్‌బాట్




హైదరాబాద్, దేశ రాజకీయాల్లో 'గ్రోక్' సంచలనం రేపుతోంది. 'ఎక్స్' (ట్విట్టర్)కు చెందిన ఈ చాట్ బాట్.. కేంద్రం అధికార బీజేపీకి పంటి కింద రాయిలా ఇబ్బంది పెడుతున్నది. 11 ఏండ్లుగా ప్రధాని అధికారంలో ఉండి చక్రం తిప్పుతున్న మోదీకి, ఇతర అధికారపక్ష కీలక నాయకులకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. దాదాపు దశాబ్దన్నర కాలంగా సోషల్ మీడియాలో, దేశంలోని ఇతర డిజిటల్ వేదికల్లో పెత్తనం చెలాయిస్తున్న బీజేపీ దూకుడుకు బ్రేకులు వేస్తోంది. బీజేపీ ఏకంగా 'గో బ్యాక్ గ్రోక్' ఉద్యమం ప్రారంభించిందంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎలా మొదలైందంటే..

టోకా అనే ఎక్స్ ఖాతా నుంచి కొన్ని రోజుల కింద వచ్చిన ఒక ప్రశ్నతో దేశంలో గ్రోక్ సంచలనాలు మొదలయ్యాయని చెప్తున్నారు. తనతోపాటు ఉన్న వారిలో తనలాంటి భావజాలం ఉన్న పదిమందిని ఎంపిక చేయడానికి టోకా ఒప్పందం. గ్రోక్ ఆలస్యంగా సమాధానం ఇవ్వడంతో టోకా అసహనం వ్యక్తం చేస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనితో చాట్ బాట్ ఎదురుదాడి ప్రారంభించింది. టోకాకు హిందీలో సమాధానం ఇవ్వాలంటే కొన్ని బూతులు వాడింది. దీనితో గ్రోక్ వ్యవహార శైలిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఆ తర్వాత అనేక వరుస ప్రశ్నలు గుప్పిస్తూ దానిని రెచ్చగొట్టారు.వాటన్నింటికీ ఏఐ చాట్ బాట్ నిర్మొహమాటంగా, ఘాటు వ్యాఖ్యలతో సమాధానాలు ఇస్తుండడంతో ప్రశ్నల వరద పెరిగింది. ఈ మాజీ ప్రధాని మోదీ, బీజేపీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌పై అడిగిన ప్రశ్నలకు గ్రోక్ ఇచ్చిన సమాధానాలు సంచలనంగా మారాయి. అప్పటి నుంచి రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. నిజానికి గ్రోక్ మొదటి నుంచి ఇలాంటి సమాధానాలు ఇస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మస్ ఎవరు? అని ఒకరు ప్రశ్నించగా.. ఎక్స్‌లో అత్యధిక నకిలీ వార్తలు సృష్టించిన వ్యక్తిగా అభివర్ణించారు. తన సృష్టికర్తపైనే ఘాటు వ్యాఖ్యలు చేసింది.

మోదీ, అమిత్ షాను అరెస్ట్ చేస్తారట..

రాజకీయ ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోదీ, బీజేపీ నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు గ్రోక్ ఇస్తున్న సమాధానాలు కమలనాథులకు మింగుడు పడటం లేదు. మోదీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్‌ఫరెన్స్‌ల గురించి కాన్ఫరెన్స్ రావాలని కోరగా.. మోదీ మీడియా ముందుకు రాలేదు, మాట్లాడే పనిని అమిత్ షాకు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోదీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు) గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీనితో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి. దేశంలోని అనేక ప్రముఖ మీడియా సంస్థల పేర్లను, వాటిలోని ముఖ్య అధికారులు పేర్లను చెప్పింది. మోదీతో సన్నిహితంగా ఉన్న అదానీ, అంబానీ వంటి పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలపై బీజేపీ ప్రభావం గురించి అడగగా. సంస్థలకు అధిపతులుగా ఉన్నారని పేరొచ్చింది.బీజేపీ తనకు అనుకూల వార్తలను ప్రచారం చేయడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నదని సమాధానం ఇచ్చింది. ముఖ్యంగా 2014 నుంచి విమర్శకుల గొంతులను నొక్కుతున్నట్టు నటించింది. మత విద్వేషాలను వ్యాప్తి చేయడానికి ఏ రాజకీయ నాయకులను అరెస్టు చేస్తారని ఓ నెటిజన్ అడగగా.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వంటి వారు మతవిద్వేషాలను ఎక్కువగా ప్రచారం చేసేందుకు గ్రోక్ పేరొన్నది. దీనితో గ్రోక్ సమాధానాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. మరోవైపు గ్రోక్ వాడుతున్న పదజాలంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఏఐ చాట్ బాట్ వాడే భాషపై కొంత నియంత్రణ ఉండేదని, గ్రోక్ ఆ హద్దులను చెరిపేసిందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ఘాటు వ్యాఖ్యలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

బీజేపీ దూకుడుకు కళ్లెం..

ఏఐ చాట్ బాట్ ఇస్తున్న సమాధానాలు సోషల్ మీడియాలో బీజేపీ దూకుడుకు కళ్లెం వేస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. గ్రోక్ సమాధానాలు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారాయని అంటున్నారు. ఎకువగా ఎక్స్‌లో వచ్చిన పోస్టులపై పర్సన్ గ్రోక్ విశ్లేషణలు జరుపుతున్నదని, కాబట్టి పక్షపాతం చూపించే అవకాశం ఉందని కొందరు బీజేపీ సానుభూతిపరులు వాదిస్తున్నారు. దీనికి 'ఒకవేళ అదే నిజమైతే సోషల్ మీడియాలో బీజేపీ అనుకూల పోస్టులే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ పార్టీకి, నేతలకు అనుకూలంగా మాత్రమే సమాధానాలు వస్తాయి కదా?' అని కొందరు నెటిజెన్లు కౌంటర్ వేస్తున్నారు. అన్ని కోణాల్లో నిర్వహించిన తర్వాతే సరైన సమాధానాలు ఇస్తోందని అభినందిస్తున్నారు.దీంతో బీజేపీ మరింత ఇరుకున పడుతోంది రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దాదాపు దశాబ్దన్నర కాలంగా దేశంలో సోషల్ మీడియాను శాసిస్తున్న బీజేపీకి గ్రోక్‌ను ఎలా ఎదుర్కుంటారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నట్టు చర్చ జరుగుతోంది. ఏకంగా 'గ్రోక్ గో బ్యాక్' ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్తున్నారు. ఏకంగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై బహిరంగంగా 'గ్రోక్ గో బ్యాక్' ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారని గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఈ అంశంపై కేంద్రం ఎక్స్ నుంచి వివరణ కోరిందని ప్రచారం జరుగుతోంది. త్వరలో చర్యలు తీసుకుంటేనే చర్చ జరుగుతోంది.

# బీహార్ కి కొత్త వారసుడు...



బీహార్ : నితీష్ కుమార్ బీహార్ సీఎం. ఆయన రాజకీయంగా నిబద్ధత కలిగిన నాయకుడు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జయప్రకాష్ నారాయణ్ వంటి వారి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1970 దశకం మధ్య నుంచి చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. 1985లో తొలిసారి బీహార్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఆ తరువాత ఎంపీగా ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా కూడా గెలుస్తూ వచ్చారు.ఆయన రాజకీయ జీవితం సుదీర్ఘమైనది. ఒకనాడు బీహార్ కి సీఎం కావాలని కలలు కన్నారు నితీష్. మొదటిసారి సీఎం అయితే రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం పడిపోయింది. కానీ ఆ తరువాత అంటే 2005 నుంచి ఈ రోజు దాకా మధ్యలో కొద్ది నెలలు తపించి నితీష్ కుమార్ బీహార్ ని నిరాటంకంగా ఏలుతున్నారు. ఆయన బీహార్ ని ఇన్నేళ్ళు పాలించిన నేతగా రికార్డుకు ఎక్కారు.అంతే కాదు మంచి పాలనను కూడా అందించారన్న పేరు సంపాదించారు. ఇక నితీష్ కుమార్ కి ఒక్కరే కుమారుడు. పేరు నిశాంత్ కుమార్. ఆయన సాఫ్ట్ వేర్ ఇంజనీర్. రాజకీయాలకు బహు దూరం. నాకు రాజకీయాల పట్ల ఆసక్తి లేదు అని చెప్పే నిశాంత్ ఇపుడు బీహార్ తెర మీద కనిపిస్తున్నారు. అంతే కాదు ఆయన నరేంద్ర మోడీ పాలన బాగుందని అంటున్నారు.ఈ ఏడాది అక్టోబర్ నవంబర్ నెలలలో బీహార్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారు అని అంటున్నారు. జేడీయూకి అధినేత నితీష్ కుమార్. ఆయన తరువాత వారసుడిగా నిశాంత్ ఎస్టాబ్లిష్ కావాలని కోరుకుంటున్నారు.అయితే ఇప్పటికే బాగా ఆలస్యం అయింది అని అంతా అంటున్నారు. లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ మాదిరిగా అదే విధంగా రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ మాదిరిగా నిశాంత్ కుమార్ తండ్రి నుంచి నేరుగా రాజకీయాలను అందుకోలేదు రాజకీయాల వైపు చూడలేదు. ఇపుడు ఆల్ ఆఫ్ సడెన్ గా వస్తే ఆయనకు ఎంత వరకూ ఆదరణ ఉంటుంది అన్నది చర్చగా ఉంది.మరో వైపు చూస్తే నితీష్ కుమార్ సైతం వారసత్వ రాజకీయాలను ఎక్కడా ప్రోత్సహించలేదు. తనతోనే అంతా అనుకున్నారు. కానీ నితీష్ ఇపుడు ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. దాంతోనే నిశాంత్ రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది అని అంటున్నారు.బీహార్ రాజకీయాల్లో బీజేపీ తమ ముఖ్యమంత్రిని చూడాలని అనుకుంటోంది. అదే విధంగా జేడీయూలో కూడా సీనియర్ నేతలు కొందరు నితీష్ ప్లేస్ లోకి రావాలని చూస్తున్నారు. ఈ విధమైన పరిస్థితుల నేపథ్యంలో నిశాంత్ కనుక రాజకీయాల్లోకి సీరియస్ గా వస్తే తండ్రి లెగసీని కొనసాగించగలరా అన్నది చర్చగా ఉంది. ఆయన దాదాపుగా యాభై ఏళ్ళ వయసులో ఉన్నారు.ఈ ఏజ్ లో రాజకీయంగా ఒక స్థిరమైన పదవిలో ఉంటూ కొనసాగాల్సి ఉంది. ఇంకా ఓనమాలు మొదలెడితే బీహార్ లాంటి గట్టి పోటీ ఉన్న చోట నిషాంత్ ఎంత మేరకు నెగ్గుకుని రాగలరు అన్నది చర్చగా ఉంది. అయితే బీజేపీ నితీష్ రాజకీయ ముద్రని కొనసాగించేందుకు నిశాంత్ ని ప్రోత్సహించినా ఆయనను ఎమ్మెల్యేగా లేక మంత్రి వరకూ తీసుకుని రావచ్చేమో కానీ సీఎం పదవి అయితే దక్కదని అంటున్నారు.అదే విధంగా పార్టీని నడపడం కీలక పదవులు చేపట్టి జనాలకు చేరువ కావడం అన్నది బిగ్ టాస్క్ అని అంటున్నారు. ఇక నిశాంత్ రాజకీయ ఆగమమం మీద బీహార్ రాజకీయ పార్టీలు భిన్నంగా స్పందిస్తున్నాయి. ఆయన ఏమి చేయగలరో చూడాలని అంటున్నాయి.మోడీని అంకుల్ అని సంభోదిస్తూ దేశం కోసం మోడీ అని రాష్ట్రం కోసం నితీష్ అని నినదిస్తున్న నిషాంత్ తొందరలోనే తనదైన రాజకీయం చూపిస్తారని ఆయన అనుచరులు అంటున్నారు. సో బీహార్ కొత్త వారసుడిని చూడబోతోంది అన్న మాట. వారసులకు పెద్ద పీట వేయడం ఈ దేశంలో ఆది నుంచి ఉంది. అయితే అదే సమయంలో వారు తమ టాలెంట్ ని కూడా రుజువు చేసుకుంటేనే రాణించేది అన్నది కూడా ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com